పత్తిలో జలకత్తి



ఎత్తిపోతల పథకం పైపులైన్ పగలడంతో ఒక్కసారిగా నీరు 20 అడుగుల ఎత్తులో ఉప్పొంగడంతో ఆవరణలోని 35 ఎకరాల పత్తి పంట నష్టం వాటిల్లింది. కోసిగి మండలం సాతనూరులో పులికనుమ ఎత్తిపోతల పథకం నిర్మించారు. మంగళవారం సాతనూరు, జంపాపురం గ్రామాల మధ్య నున్న పొలాల్లో పైపు పగిలింది. జల ప్రవాహానికి సుమారు 35 ఎకరాల పత్తి పంట పూర్తిగా మునిగింది. విషయం తెలుసుకున్న నీటి పారుదల శాఖ అధికారులు పులికనుమకు విడుదల చేసిన నీటిని నిలిపివేశారు. అనంతరం ఘటనా స్థలానికి ఆ శాఖ డీఈ మురళీ చేరుకుని పరిశీలించారు. నష్టపోయిన రైతులకు పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామన్నారు.

– న్యూస్‌టుడే, కోసిగి

ప్రత్యేక రైళ్లు రద్దు

కర్నూలు బి.క్యాంపు, ప్రయాణికుల నుంచి స్పందన లేకపోవడంతో ప్రత్యేక రైళ్లను దక్షిణ మధ్య రైల్వే రద్దు చేసింది. కాచిగూడ-తిరుపతి (07063), తిరుపతి- కాచిగూడ వెళ్లే (07064) ప్రత్యేక రైళ్లను రద్దు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ ఎ. శ్రీధర్ మంగళవారం తెలిపారు.

వైద్య కళాశాలలో
ర్యాగింగ్ రోగం



కర్నూలు వైద్యాలయం, న్యూస్‌టుడే : కర్నూలు వైద్య కళాశాలను ర్యాగింగ్ భూతం వదలడం లేదు. ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఈనెల 19న కర్నూలు వైద్య కళాశాలలో నిర్వహించిన అవగాహన సదస్సులో జిల్లా ఎస్పీ హెచ్చరించారు. సదస్సు నిర్వహించి మూడు రోజులు కాకముందే ర్యాగింగ్ జరిగినట్లు వార్తలు రావడం కలకలం రేపింది.

○ సోమవారం కళాశాల వదిలిన తర్వాత కొందరు సీనియర్లు పలువురు విద్యార్థులను ఇబ్బంది పెట్టినట్లు సమాచారం. ఆటల యాప్‌లు డౌన్‌లోడ్ చేసుకోవాలని.. గడ్డాలు, మీసాలు పెంచకూడదని, మేము చెప్పినట్లు నడుచుకోవాలని.. భోజనం తీసుకురావాలని చెప్పినట్లు తెలిసింది. ర్యాగింగ్‌కు గురైనవారిలో ఇద్దరు వైద్యుల పిల్లలు ఉన్నారు. తమ పిల్లలకే వేధింపులు ఉంటే.. మిగిలినవారి పరిస్థితి మరెలా ఉంటుందోనని ఆవేదన వ్యక్తం చేయడం.. ఇది బయటకు రావడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనకు గురయ్యారు. మరోవైపు ఇంటెలిజెన్స్ అధికారులు వివరాలు సేకరించిన ప్రభుత్వానికి నివేదించినట్లు సమాచారం.

○ ర్యాగింగ్ జరిగినట్లు వార్తలు రావడంతో ప్రిన్సిపల్ చిట్టినరసమ్మ స్పందించారు. వైద్యులు సాయిసుధీర్, హరిచరణ్, నాగేశ్వరరావు, మాధవి శ్యామల, ఇక్బాల్ హుస్సేన్‌తో మంగళవారం ప్రత్యేక కమిటీ ఏర్పాటుచేశారు. విచారణలో భాగంగా కమిటీ సభ్యులు జూనియర్ విద్యార్థులకు ఒక ప్రశ్నావళితో కూడిన పత్రం ఇచ్చారు.. మిమ్మల్ని ఎవరైనా ర్యాగింగ్ చేశారా.. ఏమైనా ఇబ్బందులు పెట్టారా తదితర విషయాలు రాయాలని.. మీ పేర్లు లేకుండా ఇవ్వాలని కోరారు.

సీమ ద్వారం.. ప్రగతి నాదం

"సీమ ముఖద్వారం అభివృద్ధికి చిరునామాగా మారుతోంది. నాడు రాజధాని దూరమైనా..నేడు రాజీలేని ప్రగతి దరిచేసే ప్రయత్నాలు సాగిస్తోంది కూటమి ప్రభుత్వం. ఓర్వకల్లులో మెగా ఇండస్ట్రియల్ హబ్, కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు ముందడుగు వేస్తోంది. కర్నూలు వినీలాకాశంలో డ్రోన్‌లు విహరించనున్నాయి. 300 ఎకరాల్లో కొత్త ప్రాజెక్టుకు రూపకల్పన చేస్తోంది. అమరావతిలో శనివారం జరిగిన డ్రోన్ సమ్మిట్‌లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారికంగా ప్రకటించారు. ఇటు హైదరాబాద్, అటు బెంగళూరు మహానగరాల జాతీయ రహదారి మధ్యలో కర్నూలు ఉండటం వల్ల అభివృద్ధి చెందుతుందని భావిస్తున్నారు. డ్రోన్ అవసరాలు విస్తృతంగా మారాయి. రక్షణ వ్యవస్థలోనూ కీలకంగా వ్యవహరిస్తున్నాయి. తక్కువ ధరతో ఎక్కువ ప్రయోజనాలు కలిగేలా డ్రోన్లు తయారు చేయాలనే లక్ష్యంతో హబ్‌ను ఏర్పాటు చేస్తున్నారు. పలువురు సాంకేతిక నిపుణులకు పెద్దఎత్తున ఉపాధికి అవకాశం కలుగుతుందని చెబుతున్నారు.

- డ్రోన్ హబ్ ఏర్పాటుకు నిర్ణయం
- 300 ఎకరాల్లో నూతన ప్రాజెక్టు
- స్మార్ట్‌సిటీ అభివృద్ధికి నిర్ణయం

ఈనాడు, కర్నూలు:



వార్డులు: 52
జనాభా 6.5 లక్షలు

హంద్రీ, తుంగభద్ర నదులున్న నేపథ్యంలో వాటికి ఆనుకునే నది వీక్షణ ఉద్యానవనం (రివర్‌వ్యూ పార్క్) అభివృద్ధి చేయాలని నిర్ణయించారు.

ఆదర్శ నగరంగా మార్చేందుకు ప్రణాళికలు

కర్నూలును ఆదర్శ నగరం (స్మార్ట్‌సిటీ)గా మారుస్తానని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇటీవల పుచ్చకాయలమడలో ప్రకటించారు. మంత్రి టి.జి.భరత్‌తో చర్చించారు. నివేదిక రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నగరపాలక సంస్థ కమిషనర్‌ను ఆదేశించింది. ప్రజలకు ఉపయుక్త ప్రాజెక్టులు నగరంలో చేపట్టేందుకు వీలుగా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

బాహ్యవలయ దారి

నగరంలోని వివిధ ప్రాంతాల్లో నివసించే వారు తమ ప్రాంతాలకు వేగంగా వెళ్లేందుకు వీలుగా సుమారు 50 కి.మీ. దూరం ఒక బాహ్య వలయ రహదారి ఏర్పాటు చేయాలని ప్రాథమికంగా నిర్ణయించారు. ఆ మార్గం కూడా త్వరలోనే ఖరారు చేయనున్నారు. ఓర్వకల్లులో బృహత్తర పారిశ్రామిక సముదాయం (మెగా ఇండస్ట్రియల్ హబ్)లో పెద్దఎత్తున పరిశ్రమలు ఏర్పాటు కానున్న నేపథ్యంలో నగరం నుంచి ఎలాంటి ట్రాఫిక్ అవాంతరాలు లేకుండా ఉండేలా రహదారి రూపకల్పన దిశగా చర్చలు సాగిస్తున్నారు. హంద్రీ, తుంగభద్ర నదీ తీరాల వెంట నెక్లెస్ రోడ్డుగా అభివృద్ధి చేసి అవుటర్ రింగురోడ్డుకు అనుసంధానం చేస్తారు. నగరంలోని రద్దీ ప్రాంతాల్లో కూడళ్లను దాటేందుకు వీలుగా మూడు వరకు పైవంతెనలు నిర్మించనున్నారు.


ఆహ్లాదం... ఆనందం

హైకోర్టు బెంచ్‌కి అధునాతన ప్రాంగణం

రాయలసీమ వాసులందరికీ ఉపయుక్తంగా ఉండేలా హైకోర్టు బెంచ్‌ని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అధునాతన సదుపాయాలతో హైకోర్టు బెంచ్ భవనాల సముదాయం ఉండేలా తీర్చిదిద్దాలని నిర్ణయించారు. ఎక్కడ ఏర్పాటు చేయనున్నారో త్వరలో ఖరారు కానుంది.

భద్రతకు ప్రాధాన్యం

నగరంలోని అన్ని పర్యాటక ప్రాంతాలను, పార్కులను అభివృద్ధి చేసి పర్యాటకులను ఆకర్షించేలా తీర్చిదిద్దనున్నారు. పర్యాటక ప్రాంతాలకు రాకపోకలకు సులభతరం చేసేలా మౌలిక సదుపాయాలు, రహదారులను అభివృద్ధి చేయడంతో పాటు మహిళల భద్రతకు వీలుగా భద్రతా సిబ్బందిని, పోలీసు నిఘా ఉండేలా చర్యలు తీసుకుంటారు.




నగర విస్తీర్ణం 117.9 చదరపు కి.మీ
నియోజకవర్గాలు: కర్నూలు, పాణ్యం, కోడుమూరు

స్వచ్ఛత చెంతకు..

నగరవాసులు సౌకర్యవంతంగా, ఆరోగ్యంగా జీవించాలంటే నగరం పరిశుభ్రంగా ఉండాలి. ప్రస్తుతం కొన్ని ప్రాంతాలకు మంచినీరు అందడంలేదు. పాతబస్తీలో విద్యుత్తు తీగలు అత్యంత సమీపంలో వేలాడుతుండటంతో ప్రమాదకర పరిస్థితుల్లో జీవిస్తున్నారు. కొత్త మంచినీటి పైపులైన్ల వ్యవస్థ, పారిశుద్ధ్య పరిస్థితుల మెరుగుతో పాటు విద్యుత్తు ముప్పు లేకుండా లైన్లను ఏర్పాటు చేయనున్నారు.

ఓర్వకల్లులో ఉపాధి మేడలు



ఓర్వకల్లు పారిశ్రామికవాడకు రూ.2,500 కోట్లను కేంద్ర బడ్జెట్‌లో కేటాయించిన నేపథ్యంలో నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్ఐసీడీసీ) ఆధ్వర్యంలో అభివృద్ధికి అడుగులు పడుతున్నాయి. మొదటిదఫా ఉప్పలపాడు, మీదివేముల, ఎన్.కొంతలపాడు గ్రామాల పరిధిలో 2,600 ఎకరాలు కేటాయించారు. రానున్న రెండేళ్లలో మొదటి దశ పనులు పూర్తయ్యే అవకాశాలున్నాయి. కేంద్ర, రాష్ట్రాల భాగస్వామ్యంతో రానున్న ఐదేళ్లలో రూ.10 వేల కోట్లతో పారిశ్రామికవాడలో మౌలిక వసతులు కల్పించేలా లక్ష్యంగా నిర్దేశించుకొన్నారు. 9,936 ఎకరాలను పరిశ్రమలకు అనువుగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్తున్నారు. రూ.60 వేల కోట్ల పెట్టుబడులు పెట్టేలా భారీ పరిశ్రమలను ఆహ్వానించేందుకు ముందస్తు కార్యాచరణ ప్రణాళికతో పాలకులు ముందుకెళ్తున్నారు.

వంటింట దీపం

- ఉచిత సిలిండర్లకు శ్రీకారం
- 12.51 లక్షల కనెక్షన్లు


ఎన్నికల్లో ప్రజలకిచ్చిన హామీలు ఒక్కొక్కటి నెరవేరుస్తూ కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోంది. సూపర్ సిక్స్ పథకాల్లో ఒకటైన "పేదలకు ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ'ని దీపావళి నుంచి అమలుచేసేలా నిర్ణయించింది. ఏడాదికి మూడు వాయుబండలు ఇచ్చేలా చర్యలు చేపట్టింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో మొత్తం 12.51 లక్షల గృహ వినియోగ వంట గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. కర్నూలు జిల్లాలో ఒక్కో సిలిండర్ ధర రూ.858గా ఉంది. ప్రభుత్వ రాయితీ రూ.41 పోనూ రూ.817 చొప్పున ఒక్కో కుటుంబానికి ఏటా రూ.2,451 వరకు ప్రయోజనం కలగనుంది.

ఈ-కేవైసీ వేగవంతం

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 75 గ్యాస్ ఏజెన్సీలు సిలిండర్లు సరఫరా చేస్తున్నాయి. కర్నూలులో 6,74,385, నంద్యాలలో 5,77,441 కనెక్షన్లు ఉన్నాయి. ఏజెన్సీల పరిధిలోని వినియోగదారులకు ఈ-కేవైసీ చేయించే ప్రక్రియ చివరి దశకు వచ్చింది. వినియోగదారులు గ్యాస్ ఏజెన్సీల వద్దకు ఆధార్ కార్డు తీసుకెళ్లి వేలిముద్రలు వేయించుకుంటున్నారు. ప్రక్రియ పూర్తి అయితే గ్యాస్ కనెక్షన్లు ఎన్ని ఉన్నాయన్న లెక్క తేలుతుంది.

24 నుంచే నమోదు చేసుకోవచ్చు

ఉచిత సిలిండర్ల పంపిణీని దీపావళి నుంచి ప్రారంభించనున్నట్లు ముఖ్యమంత్రి వెల్లడించిన నేపథ్యంలో 24వ తేదీ నుంచి సిలిండర్ కోసం నమోదు చేసుకోవచ్చు. 31వ తేదీ నుంచి దీపం పథకం కింద వాయుబండలు అందించనున్నారు. సిలిండర్ తీసుకున్నాక రెండు రోజుల్లో లబ్ధిదారుల ఖాతాల్లో గ్యాస్ రాయితీ జమ చేసేలా ప్రణాళికలు చేయాలని పౌరసరఫరాల శాఖ అధికారులకు ఆదేశాలు జారీ అయ్యాయి.



కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే :

విభాగం	కర్నూలు	నంద్యాల
దీపం	2,04,629	1,55,323
ఉజ్వల	46,824	33,732
సీఎస్ఆర్	11,436	21,505
జనరల్	4,11,496	3,66,881

ఎవరికి ఎంత లాభం

1 1999లో ముఖ్యమంత్రిగా చంద్రబాబు ఉన్నప్పుడు దీపం పథకాన్ని ప్రారంభించారు. దీని కింద ఉమ్మడి జిల్లాలో 3,59,952 గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. ఒక్కో గ్యాస్ సిలిండర్ ధర రూ.858 ఉండగా రూ.41 రాయితీ పోనూ ఏడాదికి రూ.2,451 చొప్పున 3.59 లక్షల కుటుంబాలకు సంబంధించి ప్రభుత్వం రూ.88.22 కోట్లు భరించాల్సి ఉంది.

2 సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కింద ఇంధన కంపెనీలకు సంబంధించి 32,941 కనెక్షన్లు ఉన్నాయి. వీటికి రూ.8.07 కోట్ల వరకు భరించాల్సి ఉంది.

3 రేషన్ కార్డుల ప్రాతిపదికన 7.44 లక్షల జనరల్ గ్యాస్ కనెక్షన్లు ఉండగా.. వీరికి ఏడాదికి మూడు సిలిండర్ల చొప్పున రూ.182.49 కోట్లను ప్రభుత్వం వెచ్చించాల్సి ఉంది.

4 ప్రధాన మంత్రి ఉజ్వల పథకం కింద ఉమ్మడి కర్నూలు జిల్లాలో 80,556 మంది గ్యాస్ వినియోగదారులు ఉన్నారు. వీరికి కేంద్ర ప్రభుత్వం ఒక్కో సిలిండర్‌పై రూ.300 చొప్పున ఏటా 12 సిలిండర్లకు రాయితీ ఇస్తోంది. ఒక్కో సిలిండర్‌పై రూ.558 చొప్పున రాష్ట్ర ప్రభుత్వం మూడు సిలిండర్ల మొత్తాన్ని భరించాల్సి ఉంది. ఏడాదికి మూడు సిలిండర్లకు రూ.1,674 చొప్పున 80,556 కుటుంబాలకు సంబంధించి ప్రభుత్వం రూ.13.48 కోట్లు ఖర్చు చేయాల్సి ఉంది.


పంట అమ్మేందుకు అవస్థ

- ఈ-నామ్‌కు సర్వర్ సమస్య
- అర్ధరాత్రి వరకు రైతుల నిరీక్షణ

పంట ఉత్పత్తులు అమ్ముకోవడానికి రైతులు పడిగాపులు కాస్తున్నారు. సర్వర్ సమస్య నెలకొనడంతో 'ఈ-నామ్' విధానాన్ని ఆటంకం తలెత్తింది. అంతర్జాల విధానం సరిగా పని చేయకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఉమ్మడి జిల్లాలోని ప్రధాన మార్కెట్లు కర్నూలు, ఆదోనిలో రెండు రోజులుగా అర్ధరాత్రి వరకు నిరీక్షిస్తున్నారు. సమస్య ఇప్పటికిప్పుడే పరిష్కారమయ్యే పరిస్థితి కనిపించకపోవడంతో ఆదోని మార్కెట్‌కు సెలవు ప్రకటించగా.. కర్నూలు మార్కెట్లో ఉల్లి పంట కొనుగోలుకే అనుమతి ఇవ్వడం గమనార్హం.

కర్నూలు మార్కెట్, న్యూస్‌టుడే:

రకం	దిగుబడులు (క్వింటాళ్లలో)
వేరుశనగ	733
పూల విత్తనాలు	62
ఆముదాలు	802
వాము	50
మొక్కజొన్న	151
కందులు	50
ఉల్లిగడ్డలు	9,736
ఎండుమిర్చి	60
కొర్రలు	125
మినుములు	16
సోయాబీన్స్	14
సజ్జలు	91



మంగళవారం కర్నూలు మార్కెట్‌కు వచ్చిన దిగుబడి

25 వరకు ఇదే పరిస్థితి

ఈ.నామ్ విధానంలో సాంకేతిక సమస్యల నేపథ్యంలో కర్నూలు వ్యవసాయ మార్కెట్‌లో బుధ, గురువారాల్లో ఉల్లి మినహా ఇతర పంట ఉత్పత్తుల క్రయవిక్రయాలు జరగవు.. ఈనెల 24 వరకు ఉల్లి క్రయవిక్రయాలు మాత్రమే జరుగుతాయని మార్కెట్ కమిటీ కార్యదర్శి జయలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. 25వ తేదీ నుంచి అన్నిరకాల పంట ఉత్పత్తుల క్రయవిక్రయాలు చేపడతామన్నారు.

అర్ధరాత్రి వరకు విక్రయాలు

కర్నూలు విపణికి సోమవారం రికార్డు స్థాయిలో 404 మంది రైతులు 13,070 క్వింటాళ్ల ఉల్లి దిగుబడులు తీసుకొచ్చారు. మొత్తం 670 మంది రైతులు అన్నిరకాల పంట ఉత్పత్తులు తెచ్చారు. రాత్రి వరకు చూసి మాన్యువల్‌గా.. పాత పద్ధతిలో ధరలు ఖరారు చేశారు. ఫలితంగా ఉల్లి తూకాలు రాత్రి పది గంటల వరకు జరిగాయి. మంగళవారం 9,736 క్వింటాళ్ల దిగుబడులు వచ్చాయి. ధరల వివరాల కోసం అన్నదాతలు గంటల తరబడి నిరీక్షించినా ఫలితం లేకపోయింది. చివరికి మంగళవారం సాయంత్రం 4 గంటలకు ధరలు వెల్లడించారు. మొత్తం 631 మంది రైతులు అన్నిరకాల పంట ఉత్పత్తులు తీసుకొచ్చారు. కమీషన్ ఏజెంట్లు చేతిరాతో రశీదులు ఇస్తున్నారు. ఆదోని మార్కెట్‌కు సోమవారం 12 వేల క్వింటాళ్ల పత్తి, మంగళవారం 10 వేల క్వింటాళ్ల పత్తి తీసుకొచ్చారు. తూకాల ప్రక్రియ అర్ధరాత్రి వరకు కొనసాగింది.

రైతుల వెలవెల

ఉమ్మడి జిల్లాలో కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరు మార్కెట్లలో ఈ-నామ్ విధానం అమల్లో ఉంది. ఇక్కడికి రెండు జిల్లాల రైతులే కాకుండా తెలంగాణ, కర్ణాటక నుంచి పంట ఉత్పత్తులు తీసుకొస్తుంటారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ.నామ్ విధానంలో సర్వర్ సమస్యలు నెలకొనడంతో కొనుగోలు ప్రక్రియకు ఆటంకాలు ఎదురవుతున్నాయి. ధరల ఖరారు.. తూకాలు, బిల్లుల చెల్లింపుల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది. దీంతో మాన్యువల్‌గా.. పాత పద్ధతిలో ధరలు ఖరారు చేయడంతో వ్యాపారులు పెత్తనం చేస్తున్నారు. ధరలు అమాంతం తగ్గిస్తున్నారు.

సైబర్ వల

- రూ.44.25 లక్షలు పోగొట్టుకున్న బాధితుడు

కర్నూలులోని ఇంజినీరింగ్ కాలనీకి చెందిన అంబదాస్ సైబర్ నేరగాళ్ల చేతిలో పెద్దఎత్తున మోసపోయారు. సామాజిక మాధ్యమాల్లో గుర్తుతెలియని వ్యక్తి పరిచయమయ్యాడు. అకాడమీ గ్రూప్ అండ్ ఎస్కార్ట్ సెక్యూరిటీస్‌కు సంబంధించిన స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడి పెడితే భారీగా లాభాలు వస్తాయని నమ్మించాడు. ఈ నేపథ్యంలో అంబదాస్ వేర్వేరు ఖాతాల ద్వారా రూ.44.25 లక్షలు పెట్టుబడి పెట్టారు. లాభాలు రాకపోవడంతో తన పెట్టుబడి తిరిగి ఇచ్చేయాలని కోరగా ఎలాంటి స్పందన లేదు. చివరికి మోసపోయినట్లు గ్రహించిన బాధితుడు కర్నూలు మూడో పట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

– న్యూస్‌టుడే, కర్నూలు నేరవిభాగం

నేటి నుంచి బీఈడీ సెమిస్టర్ పరీక్షలు

రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలోని బీఈడీ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఒకటో సెమిస్టర్ పరీక్ష నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఇన్‌ఛార్జి వీసీ ఎన్‌టీకే నాయక్ తెలిపారు. 23వ తేదీ నుంచి 29వ తేదీ వరకు 17 కేంద్రాల్లో పరీక్ష జరుగుతుందని పేర్కొన్నారు. రెగ్యులర్ 3,688, సప్లిమెంటరీ 1,513 మంది పరీక్ష రాయనున్నారన్నారు.

– న్యూస్‌టుడే, కర్నూలు విద్య

అడవిలో అర్ధరాత్రి

- ఆగిపోతున్న వాహనాలు
- గుంతలమయంగా ఘాట్ రోడ్డు



వినుకొండ నుంచి కర్రల లారీతో కర్ణాటక రాష్ట్రం గాందోలికి వెళ్తున్నాం. రోళ్లపెంట వద్ద గుంతలకు వాహనం కట్టర్ బ్లేడ్లు విరిగిపోయాయి. సోమవారం రాత్రి 12 గంటల సమయంలో అడవిలో ప్రయాణం ఆగింది. మంగళవారం ఉదయం డ్రైవర్ ఆత్మకూరుకు వెళ్లి మెకానిక్‌ను తీసుకొచ్చారు. మరమ్మతులు చేసేసరికి రాత్రి అయ్యింది.. భయం.. భయంగా గడపాల్సి వచ్చింది. - సుంకన్న వెలుగోడు!!

★ కర్నూలు నుంచి శ్రీశైలం, ప్రకాశం, అమరావతి వెళ్లే ప్రయాణికులకు నల్లమల ఘాట్ రోడ్డులో వెళ్లే ప్రయాణికులందరి పరిస్థితి ఇలానే ఉంది.. అసలే చిట్టడవి.. ఒకే వరుసలో వెళ్లాలి.. చరవాణి సిగ్నల్స్ ఉండవు.. బిక్కుబిక్కుమంటూ ప్రయాణం.. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు దారంతా గుంతలమయంగా మారింది.. వాటిని దాటలేక వాహనాలన్నీ మార్గమధ్యంలోనే ఆగిపోతున్నాయి.. ఈ సమాచారం పోలీసులకు సకాలంలో అందక ప్రయాణికులు అర్ధరాత్రి నల్లమల అడవిలో గడపాల్సిన పరిస్థితి నెలకొంది. 'ఈనాడు-ఈటీవీ' బృందం మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలన చేయగా ప్రయాణికులు వెతలు వినిపించారు. 'కూటమి' ప్రభుత్వం దృష్టి సారించాలని విన్నవిస్తున్నారు.

– ఆత్మకూరు, న్యూస్‌టుడే:





ఆత్మకూరు నుంచి దోర్నాల మధ్య 58 కి.మీ.లు ఉండగా.. అందులో దాదాపు 40 కి.మీ.ల మేర అటవీ మార్గం ఉంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు దారంతా చెదిరింది. తారు కొట్టుకుపోయింది.. వెంకటాపురం- రోళ్లపెంట మధ్య గుంతలు దాటలేని పరిస్థితి నెలకొంది. అక్కడి నుంచి దోర్నాల మండలం కొర్రప్రోలు వరకు 'దారి'ణంగా మారింది.

రోళ్లపెంట సమీపంలో రోడ్డుపై గుంతలు

బైర్లూటి- రామయ్యకుంట మధ్యలో రెండు చోట్ల పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. అదేవిధంగా రోడ్డుకు ఇరువైపులా ఏర్పడిన గుంతలతో వాహనాలు కిందికి దిగలేని పరిసితి నెలకొంది. రోళ్లపెంట సమీపంలో కి.మీ మేర గుంతలే ఉన్నాయి. నల్లమడుగులపెంట గేట్ కుదుపు రస్తా వరకు ఇలానే ఉంది.

వెంకటాపురం- సంజీవనగర్‌తండా మధ్య పల్లెకట్ల సమీపంలో పెద్ద గుంత ప్రమాదకరంగా మారింది. తాత్కాలికంగా వేసిన కంకర రాళ్లు ఇటీవల కురిసిన వర్షాలకు కొట్టుకుపోయాయి.

అడవిలో వదిలేసిన జగన్

● పిన్నాపురం నుంచి ప్రకాశం జిల్లా కొత్తూరు వరకు దాదాపు 38.80 కి.మీ. విస్తరించడానికి తెదేపా హయాంలో 2017-18 వరకు సర్వే చేశారు. ఇందులో ఏడు కి.మీ వెడల్పుతో తారు రోడ్డు, 1.5 మీ. చొప్పున ఫుట్‌పాత్ ఉండేలా నిర్మించాలని ప్రతిపాదించారు. అనుమతులు ఇవ్వాలని దిల్లీలోని అటవీ శాఖ ప్రధాన కార్యాలయానికి నివేదిక పంపించారు. 2019లో అధికారంలోకి వచ్చిన జగన్ సర్కారు పనులను అటకెక్కించింది.. వాహనాల రద్దీ తక్కువగా ఉందంటూ పక్కన పెట్టారు.

విస్తరణ కొంత వరకే

కర్నూలు-గుంటూరు (ఎన్‌హెచ్ 340సి) రహదారిని ప్రస్తుతం గార్గేయపురం నుంచి ఆత్మకూరు మండలం పిన్నాపురం వరకు 73.600 కి.మీ. మేర నాలుగు వరుసల రోడ్డును ప్రతిపాదించారు. ప్రస్తుతం నన్నూరు టోల్‌ప్లాజా నుంచి ఆత్మకూరు వరకు విస్తరిస్తున్నారు. రూ.1200 కోట్ల వ్యయంతో సుమారు 72 కి.మీ మేర పనులు చేస్తున్నారు.



గస్తీ వాహనానికి సుస్తి



అత్యవసరమైనా.. ఆ వాహనాన్ని తోస్తేనే ముందుకు కదులుతుంది. ఇదేదో ఇంధన పొదుపో.. కొత్తరకం వాహనమో అనుకుంటే పొరపాటే. వెల్దుర్తి సమీపంలోని 44వ జాతీయ రహదారిపై గస్తీ (హైవే పోలీసు పెట్రోలింగ్) వాహనానికి సుస్తి చేసింది. – న్యూస్‌టుడే, వెల్దుర్తి

సాగునీటి ప్రాజెక్టులకు ప్రభుత్వం ప్రాధాన్యం

■ తాత్కాలిక మరమ్మతులకు రూ.6.56 కోట్ల విడుదల: బీవీ

ఎమ్మిగనూరు వ్యవసాయం, న్యూస్‌టుడే: వైకాపా పాలనలో రివర్స్ టెండర్ల పేరిట సాగునీటి ప్రాజెక్టులను నాశనం చేసిందని, కూటమి ప్రభుత్వం ప్రాజెక్టులకు ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. మంగళవారం ఆయన ఎమ్మిగనూరులో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. గురురాఘవేంద్ర ఎత్తిపోతల పథకాల నియంత్రికలు, మోటార్లు ధ్వంసం చేసిన వాటికి ఏడు ఎత్తిపోతల పథకాలకు తాత్కాలిక మరమ్మతులకు రూ.1.26 కోట్లు, ఎల్లెల్సీలో వరద కాల్వ మరమ్మతులకు రూ.4.30 కోట్లు, గాజులదిన్నె



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి

ప్రాజెక్టుకు రూ.కోటి మొత్తం రూ.6.56 కోట్లు ప్రభుత్వం కేటాయించిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో ప్రాజెక్టు గేట్లు కొట్టుకుపోయినా పట్టించుకోలేదని, తుంగభద్ర ప్రాజెక్టు గేటు కొట్టుకుపోతే సీఎం చంద్రబాబునాయుడు స్పందించి యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేయించారన్నారు. సాగునీటిని సక్రమంగా అందించేందుకు కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందన్నారు. జిల్లా పశ్చిమ ప్రాంతానికి ఆయువుపట్టులాంటి గుండ్రేవుల, ఆర్డీఎస్ కుడి కాలువలను ప్రాధాన్యతా క్రమంలో నిర్మించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ సమావేశంలో నాయకులు ఈరన్నగౌడ్, నారాయణరెడ్డి, జలవనరుల శాఖ ఎస్ఈ బాలచంద్రారెడ్డి, ఈఈ భాస్కర్‌రెడ్డి, డీఈఈ విజయ్‌కుమార్, విజయరాజ్ పాల్గొన్నారు.

పశ్చిమ ఆయకట్టుకు సిరులు

■ గురురాఘవేంద్ర ప్రాజెక్టుపై శ్రద్ధ తీసుకున్న కూటమి ప్రభుత్వం

■ తాజాగా రూ.1.60 కోట్ల విడుదల ■ మరో రూ.15 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు

కర్నూలు జలమండలి, ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: సాగునీటి ప్రాజెక్టులను ఏమాత్రం పట్టించుకోకుండా, ఆయకట్టును నిర్వీర్యం చేసిన గత వైకాపా తప్పులను కూటమి ప్రభుత్వం దశలవారీగా సరిదిద్దుతోంది. ఆయకట్టు రైతులకు అండగా నిలిచేందుకు ఒకవైపు సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించేందుకు శ్రీకారం చుట్టిన ప్రభుత్వం, వైకాపా హయాంలో నిర్లక్ష్యానికి గురైన ప్రాజెక్టులను ఆయకట్టు లక్ష్యంగా ముందుకు సాగుతోంది. కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంతంలో ఎంతో కీలకమైన గురురాఘవేంద్ర ప్రాజెక్టు పరిధిలోని 10 ఎత్తిపోతల పథకాలకు గత ప్రభుత్వం ఒక్క రూపాయి విదల్చకపోవడంతో దీని పరిధిలోని పథకాల వద్ద చెట్లు పెరిగి, కాల్వల్లో నీటి ప్రవాహం కష్టంగా మారింది. ఐదేళ్లలో నిర్వహణకు కూడా నిధులు విడుదల చేయని దుస్థితి నెలకొంది. 2019-20లో పూలచింత, సోగనూరు, మూగలదొడ్డి పథకాలకు నిర్వహణ పనులు (ఓఅండ్ఎం) చేసిన గుత్తేదారునికి ఇంత వరకు బిల్లులు చెల్లించకపోవడం గమనార్హం.

బీవీ ఆశయం.. సాగునీటికి బలం

అప్పటి మంత్రి, దివంగత బీవీ మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ వహించడంతో గురురాఘవేంద్ర ప్రాజెక్టు అమల్లోకి వచ్చింది. తుంగభద్ర దిగువ కాల్వ (ఎల్లెల్సీ) కింద సాగు చేసిన పంటలకు సరిగా నీరందని పక్షంలో గురురాఘవేంద్ర ప్రాజెక్టు పరిధిలోని 10 ఎత్తిపోతల ద్వారా అదనంగా సాగునీటిని విడుదల చేసేందుకు బీవీ కృషి చేశారు. ఈ పథకాల ద్వారా 69,740 ఎకరాలకు సాగునీరు అందడంతో పశ్చిమ ప్రాంత రైతులు పంటలు సాగు చేసుకున్నారు.

గురురాఘవేంద్ర ప్రాజెక్టు పరిధిలోని ఎత్తిపోతల వివరాలు		
నీటి వినియోగం	:	5.370 టీఎంసీలు
విద్యుత్తు అవసరం	:	37.984 మెగావాట్లు
లబ్ధి పొందే నియోజకవర్గాలు	:	ఎమ్మిగనూరు, కోడుమూరు, మంత్రాలయం
లబ్ధి పొందే గ్రామాలు	:	74



పథకం	ఆయకట్టు (ఎకరాలు)
మూగలదొడ్డి	3,793
పూలచింత	4,400
సోగనూరు	4,648
చిలకలడోన	4,083
సూగూరు	2,925
దుద్ది	3,000
బసలదొడ్డి	6,450
మాధవరం	4,211
పులికనుమ	26,400
పులకుర్తి	9,830

నీటి విడుదలకు కష్టం

వైకాపా హయాంలో జీఆర్పీలకు నిధులు విడుదల చేయకపోవడంతో ఆయకట్టుకు నీటి విడుదల కష్టంగా మారింది. నీటిపారుదల శాఖ ఇంజినీర్లు గతంలో ఎన్నోసార్లు ఆ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినా ఫలితం లేకుండా పోయింది. ఒక్కో పథకానికి ఇరువురు ఆపరేటర్లు, సిబ్బంది జీతభత్యాలు, మోటార్లు పని చేసేందుకు ఏటా రూ.15-20 లక్షలు వెచ్చించాల్సి ఉంటుంది. కానీ వైకాపా ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. గురురాఘవేంద్ర ప్రాజెక్టు ద్వారా పశ్చిమ ప్రాంత రైతులకు సమృద్ధిగా సాగునీరందించేందుకు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంతో తాత్కాలిక మరమ్మతుల కింద రూ.1.60 కోట్లు విడుదలయ్యాయి.

పీఎంశ్రీతో పాఠశాలలకు మహర్దశ



మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా

కర్నూలు విద్య, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన పీఎంశ్రీ పథకంతో ప్రభుత్వ బడులలో నాణ్యమైన విద్య అందించడంతోపాటు అభివృద్ధి చేయాలని కలెక్టర్ రంజిత్ బాషా పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో డీఈవో శామ్యూల్ ఆధ్వర్యంలో పీఎంశ్రీ పథకంపై మంగళవారం సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ పథకం కింద జిల్లాలో 52 పాఠశాలలు ఎంపికయ్యాయన్నారు. పర్యావరణ పద్ధతిలో విద్యా బోధన సాగించేలా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. క్రీడలను ప్రోత్సహించేందుకు ఆట స్థలాలు వినియోగంలోకి తీసుకురావాలని పేర్కొన్నారు. క్రీడల కోసం ప్రత్యేకంగా ఒక గదిని ఏర్పాటు చేయాలన్నారు. పరిశోధనల కోసం ఏర్పాటుచేసే కెమిస్ట్రీ ల్యాబ్‌ను వినియోగించుకోవాలన్నారు. పనులు త్వరగా పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని విద్యా శాఖను ఆదేశించారు.

సామాజిక బాధ్యత నేర్పండి : ఎస్పీ



సమావేశానికి హాజరైన కళాశాల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు

కర్నూలు నేర విభాగం, న్యూస్‌టుడే: విద్యాబోధనతో పాటు యువతకు సామాజిక బాధ్యతలు, విలువలు నేర్పించి దిశానిర్దేశం చేయాలని ఎస్పీ జి.బిందు మాధవ్ అన్నారు. నగరంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో ఇంటర్, డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులతో మంగళవారం ఎస్పీ సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ డ్రైవింగ్ లైసెన్సు లేకపోవడం.. తీవ్రమైన శబ్దాలు చేసే సైలెన్సర్‌లు కలిగిన బైకులతో వచ్చే యువకులకు నిబంధనలు, రహదారి ప్రమాదాలపై అవగాహన కల్పించాలని చెప్పారు. సైలెన్సర్లతో అత్యుత్సాహం ప్రదర్శిస్తే 77778 77722 లేదా 91211 01100 నంబర్లకు, సైబర్ నేరం జరిగితే 1930 నంబరుకు ఫోన్ చేసేలా సూచించాలన్నారు.

సైబర్ వలలో చిక్కి విలవిల

● రూ.లక్షల్లో మోసాలు ● అప్రమత్తతే రక్షణ




■ ఆదోని పట్టణానికి చెందిన దేవేంద్రరాజు ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరుతో ఉన్న నకిలీ వెబ్‌సైట్‌లో 15 రోజులుగా ఆన్‌లైన్ ట్రేడింగ్ చేయడం ప్రారంభించారు. మొదట్లో ఆ సంస్థ నిర్వాహకులు ట్రేడింగ్ ద్వారా లాభాలు వచ్చేలా చూపారు. దీంతో ఆశపడిన బాధితుడు పెద్ద మొత్తంలో ఆన్‌లైన్‌లో డబ్బులు డిపాజిట్ చేశారు. చివరకు ఆ ఆన్‌లైన్ సంస్థ తనను మోసం చేసిందని గుర్తించేలోపు రూ.2.54 లక్షలు నష్టపోయారు. న్యాయం చేయాలని ఈ నెల 9వ తేదీన పోలీసులను ఆశ్రయించారు. ఇలాంటి మోసాలు జిల్లాలో పెద్దఎత్తున జరుగుతున్నాయని పోలీసు అధికారులు చెబుతున్నారు.

■ ఆదోని పట్టణంలోని మార్కెట్ యార్డు సమీపంలోని ఓ హోటల్ నిర్వాహకుడికి ఈ నెల 8వ తేదీన గుర్తుతెలియని సైబర్ నేరగాడు ఫోన్‌చేశాడు. 'నేను 5 కి.మీ. దూరంలో ఉన్నాను. అర్జెంటుగా 18 భోజనాలు పార్సిల్ చేయాలి. ఎంతవుతుందో చెబితే ఫోన్‌పే చేస్తాను.' అని చెప్పాడు. బిల్లు రూ.1880 అయిందని హోటల్ నిర్వాహకుడు చెప్పారు. పొరపాటున రూ.11,880 ఫోన్‌పే చేశాను.. తిరిగి రూ.10వేలు పంపాలని సైబర్‌నేరగాడు హోటల్ నిర్వాహకుడికి ఫోన్‌చేశాడు. తన ఖాతాలో డబ్బులు రాలేదని హోటల్ నిర్వాహకుడు చెప్పినా.. వినకుండా సైబర్ నేరగాడు బెదిరింపులకు పాల్పడిన ఘటన ఇటీవల జరిగింది.

■ ఆదోని పట్టణానికి చెందిన ఓ పారిశ్రామికవేత్తను ఓ సైబర్ నేరగాడు ఫోన్ చేశాడు. 'నేను ఆదాయ పన్నుల శాఖ ఆదోని సహాయ అధికారిని మాట్లాడుతున్నా.. మీరు గత ఏడాది ఐటీ రిటర్న్స్ చేసిన ఫైళ్లను సరి చూసుకొని పెట్టుకోండి.. మా జిల్లా అధికారి వచ్చి తనిఖీ చేస్తారు. రికార్డులు సరిగా లేకపోతే మీకు రూ.లక్ష నుంచి రూ.50 లక్షలు వరకు అపరాధ రుసుం విధిస్తారు' అని చెప్పాడు. ఆందోళనకు గురైన ఆ పారిశ్రామికవేత్తను సైబర్ నేరగాడు మరింత భయపెట్టే ప్రయత్నం చేశాడు. 'జిల్లా అధికారి మీ పరిశ్రమకు తనిఖీకి రాకుండా ఉండాలంటే తక్షణమే రూ.15వేలు ఫోన్‌పే చేయండి. ఎందుకొచ్చిన గొడవలే.. రూ.1.50లక్షలు అయ్యేది రూ.15వేలతో పోతుందనుకుని, వ్యాపారి ఫోన్‌చేశారు. తర్వాత మోసపోయానని తెలుసుకుని మిన్నకుండిపోయారు. ఇలా జిల్లాలో ఎంతో పారిశ్రామికవేత్తలది ఇదే పరిస్థితి.

నిర్ధారించుకొని స్పందించాలి

సైబర్ నేరగాళ్లు రోజు రోజుకు కొత్త మార్గాలు అనుసరిస్తున్నారు. ఆన్‌లైన్ మోసాల నుంచి ప్రజలు సురక్షితంగా బయటపడాలంటే అప్రమత్తతే ప్రధాన ఆయుధంగా మలుచుకోవాలి. ఎవరైనా ఫోన్ చేసి ఓటీపీ నెంబర్లు చెప్పమని.. తాము ఐటీ అధికారులమని, బ్యాంకు అధికారులమని చెప్పడం వంటి ఫోన్లు చేస్తే అవి ఒకటికి రెండు సార్లు నిర్ధారించుకోవాలి. ప్రధానంగా బ్యాంకు అధికారులు ఎవరూ మీ ఖాతాకు సంబంధించి ఫోన్‌చేసి వివరాలు చెప్పమని అడగరనే విషయాన్ని గుర్తుంచుకోవాలి. సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలనే దానిపై పోలీసు శాఖ విస్తృతంగా ప్రచారాలు చేయాలి. ఎలాంటి మోసాలకు పాల్పడుతున్నారనే దానిపై ప్రజలను అప్రమత్తం చేస్తూ ఉంటే ఇలాంటి మోసాలు జరిగే అవకాశాలు తగ్గుముఖం పడతాయి.



ఆదోనికి చెందిన ఓ హోటల్ నిర్వాహకుడికి సైబర్ నేరగాడు పంపించిన నకిలీ ఫోన్‌పే చేసినట్లు మెసేజ్

ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే: సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకుని జిల్లా ప్రజలు విలవిల్లాడుతున్నారు. సాంకేతికతను ఇష్టానుసారంగా వినియోగిస్తూ.. అక్రమాలకు పాల్పడుతున్నారు. మోసాలకు కొత్త దారులు వెతుకుతూ.. బ్యాంకు ఖాతాల్లోని డబ్బును కాజేస్తున్నారు. ప్రజలు కష్టపడి బ్యాంకుల్లో దాచుకున్న నగదును సైబర్ నేరగాళ్లు కన్నం వేసి బాధితులకు తీరని నష్టం మిగుల్చుతున్నారు. ఇటీవల సైబర్ నేరగాళ్లు సరికొత్త పద్ధతుల్లో మోసాలకు పాల్పడుతూ ప్రజల సొమ్ము రూ.లక్షల్లో లాగేసుకుంటున్నారు. ప్రజలు జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఉంది.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండండి - సోమన్న, డీఎస్పీ, ఆదోని




సైబర్ నేరగాళ్ల పంథా మార్చుకుని, ప్రజలను మోసం చేస్తున్నారు. వారి మాటలు నమ్మి బ్యాంకు ఖాతాల్లోని డబ్బు పోగొట్టుకుంటున్నారు. మరికొందరు ఐటీ అధికారులమని ప్రజలకు బెదిరింపు కాల్స్ చేస్తున్నారు. ఇది మా దృష్టికి వచ్చింది. లాటరీ టికెట్ తగిలిందనో. . మీకు రుణాలు ఇప్పిస్తామనో వివిధ రకాలుగా ప్రజలకు ఫోన్లు చేసి మాయమాటలు చెప్పి ప్రజల బ్యాంకు ఖాతాల్లో నుంచి డబ్బు కాజేస్తున్నారు. ఇలాంటి వాటికి మోసపోయిన ప్రజలు తక్షణమే సమీప పోలీసు స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయవచ్చు. సైబర్ నేరాలపై ఎస్పీ బిందు మాధవ్ ప్రత్యేక దృష్టి సారించారు. ప్రజలు బ్యాంకు ఖాతాల్లోని డబ్బులు పోగొట్టుకున్నట్లైతే వెంటనే పోలీసు స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేస్తే సైబర్ నేరగాళ్ల బ్యాంకు ఖాతాలను ఫ్రీజ్ చేసి.. అందులో డబ్బులు ఉంటే బాధితులకు డబ్బులు వచ్చేలా చర్యలు తీసుకుంటాం.

వేంకటేశ.. విన్నావా చిన్నారుల ఘోష

వేంకటేశా.. బతుకుదెరువు వెతుక్కుంటూ.. ఊరొదిలి నీ పాదాల చెంత చేరారు. రెక్కలు ముక్కలు చేసుకుని ఇద్దరు చిన్నారులను కంటికి రెప్పలా కాచారు. దంపతులిద్దరూ కుమారుల నవ్వుల సవ్వడి వింటూ కష్టాన్ని మర్చిపోయేవారు. ఆనందాల జీవితంలో విషాదం నింపావా దేవుడా! తల్లికేమైందోనని తల్లడిల్లుతున్న చిన్నారులను ఓదార్చేదెవరు?. కన్నీటి ధారలకు అడ్డుకట్ట వేసేదెవరు? అమ్మా.. లేవమ్మా అని మాటలే సరిగా రాని చిన్నోడి వేదన తీర్చేదెవరు? వేంకటేశా.. ఎంతపని చేశావయ్యా!

- న్యూస్‌టుడే, ఆస్పరి



కుమారులతో గోవిందు, మౌనిక దంపతులు


ఉపాధి కోసం అత్త, భర్త, పిల్లలతో కూలిపనులకు వెళ్లిన మహిళా కార్మికురాలు ప్రమాదవశాత్తు మృతిచెందిన ఘటన తిరుపతి జిల్లా కేంద్రంలో మంగళవారం జరిగింది. బంధువులు తెలిపిన వివరాల మేరకు.. ఆస్పరి మండలంలోని ఐనకల్లు గ్రామానికి చెందిన చాకలి గోవిందు, మౌనిక(21) దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. సొంతూరిలో పనులు లేక పోవడంతో అత్త ఈరమ్మతో కలిసి అందరూ తిరుపతికి వలస వెళ్లారు. పిల్లలను ఈరమ్మ వద్ద వదిలి సోమవారం దంపతులిద్దరూ పనికి వెళ్లారు. మౌనిక సిమెంట్ కంకర కలిపే యంత్రం వద్ద పని చేస్తుండగా.. ఆమె చీరకొంగు యంత్రానికి చుట్టుకుంది. చీర మెడకు చుట్టుకోవడంతో ఊపిరాడక అక్కడికక్కడే మృతిచెందినట్లు తెలిపారు. తన కళ్లెదుటే భార్య మృత్యుఒడికి చేరడంతో గోవిందు కన్నీరు మున్నీరయ్యారు. కుమారులు ఐదేళ్ల గోవర్ధన్, ఏడాది వయసున్న హరివర్ధన్ అమ్మా.. అమ్మా.. అంటూ తల్లి మృతదేహంపై పడి గుక్కపట్టి ఏడుస్తున్న తీరు అక్కడి వారిని కంటతడి పెట్టించింది. ఈ ఘటనతో గ్రామంలో విషాదం అలముకుంది.

ఉల్లి క్వింటా గరిష్ఠ ధర రూ.4,429

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: కర్నూలు వ్యవసాయ విపణికి మంగళవారం వివిధ పంట ఉత్పత్తులు వచ్చాయి. 9,736 క్వింటాళ్ల ఉల్లి దిగుబడులు రాగా క్వింటా కనిష్ఠ ధర రూ.536, మధ్యస్థ ధర రూ.3,919, గరిష్ఠ ధర రూ.4,429 పలికింది. వేరుశనగకాయలు క్వింటా గరిష్ఠ ధర రూ.6,370, పూల విత్తనాలు రూ.5,369, ఆముదాలు రూ.5,991, వాము రూ.7,569, మొక్కజొన్న రూ.2,211, కందులు రూ.9,609, ఎండుమిర్చి రూ.10,210, కొర్రలు రూ.3,791, మినుములు రూ.8,311, సోయాబీన్స్ రూ.4,251, సజ్జలు రూ.2,151కు వ్యాపారులు కొనుగోలు చేశారు.

హంద్రీలో మొలకెత్తిన అక్రమాలు


కర్నూలు నగరం మీదుగా వెళ్లే నదిపై అక్రమార్కులు కన్నేశారు. కొందరు ఖాళీ స్థలాన్ని ఆక్రమించుకుని గడ్డి పెంచుతున్నారు. గడ్డి ఏపుగా పెరిగేందుకు పెదఎత్తున రసాయన ఎరువులు వినియోగిస్తుండటంతో విషతుల్యమవుతోంది. ఎత్తుగా మట్టి తోలడంతోపాటు నదిలో చెట్లు పెరగడంతో నీటి ప్రవాహానికి ఆటంకం కలుగుతోంది. అధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టాల్సి ఉంది. - ఈనాడు, కర్నూలు



గడ్డి ఏపుగా పెరిగేలా రసాయన మందులు చల్లుతూ..

ఐదు తరగతులు.. వంద మంది విద్యార్థులు

కర్నూలు జిల్లా మంత్రాలయం నియోజకవర్గం కౌతాళం మండలం హాల్వి గ్రామంలోని ఎస్‌డబ్ల్యూ ప్రాథమిక పాఠశాలలో గదుల కొరతతో ఒకే గదిలో ఐదు తరగతులు నిర్వహిస్తున్నారు. వంద మంది విద్యార్థులను ఒకే గదిలో కూర్చోబెడుతున్నారు. ఈ ప్రాథమిక పాఠశాలలో నాడు-నేడు కింద గదుల నిర్మాణం చేపట్టాలని నిర్ణయించి పాత భవనాన్ని కూల్చేశారు. ఆ తర్వాత హాల్విలోని ఉన్నత పాఠశాలలో ఈ పాఠశాలను విలీనం చేయడంతో పనులు నిలిపివేశారు. గతేడాది వరకు ఇక్కడ 1, 2, 3 తరగతులు మాత్రమే నిర్వహించారు. ఈసారి ఐదు తరగతులు నిర్వహిస్తున్నారు. మొత్తం 100 మంది విద్యార్థులు ఉన్నారు. ఒకే గదిలో ఐదు తరగతులను ఒక్క ఉపాధ్యాయిని మాత్రమే కొనసాగిస్తుండటం గమనార్హం.



- న్యూస్‌టుడే, మంత్రాలయం గ్రామీణం

హత్యకేసులో నిందితుడి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ

గూడూరు, న్యూస్‌టుడే: గూడూరులో సెప్టెంబరు 22న చోటుచేసుకున్న హత్య కేసులో నిందితున్ని అరెస్టు చేసినట్లు సీఐ మహమ్మద్ తబ్రేజ్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన గూడూరు ఎస్సై తిమ్మయ్యతో కలిసి విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. గూడూరులోని ఏబీఎం కాలనీలో నివాసముంటున్న సంధ్యపోగు అలెగ్జాండర్, మృతుడు బోయ రవికి మధ్య వ్యక్తిగత గొడవలు ఉండటంతో హత్య చేసినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు నిందితున్ని అరెస్టు చేసి రిమాండుకు పంపుతున్నామన్నారు. ఈ కేసులో ప్రతిభ కనబర్చిన గూడూరు ఎస్సై తిమ్మయ్య, స్పెషల్ బ్రాంచి ఎస్సై మధుసూదన్‌రెడ్డి, ఏఎస్సై మస్తాన్, పోలీసులు ప్రదీప్, శ్రీరాములు, సి.బెళగల్ కానిస్టేబుల్ గజేంద్ర, కర్నూలు మూడో పట్టణ పోలీస్‌స్టేషన్ కానిస్టేబుళ్లు కిశోర్, చంద్రబాబు, హెడ్‌కానిస్టేబుల్ ప్రసాద్‌సింగ్, కోడుమూరు హెడ్ కానిస్టేబుళ్లు రాముడు, జగదీశ్, భాస్కర్, హోంగార్డు రాముడును సీఐ అభినందించి రివార్డులు అందజేశారు.

కర్ణాటకలో హెచ్.మురవణివాసి ఆత్మహత్య



చిన్న రంగయ్య (పాత చిత్రం)

పెద్దకడబూరు, న్యూస్‌టుడే: కర్ణాటక రాష్ట్రం రాయచూరు జిల్లాలో పెద్దకడబూరు మండలం హెచ్.మురవణికి చెందిన వలస కూలీ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకొన్న ఘటన మంగళవారం చోటు చేసుకొంది. కుటుంబ సభ్యుల వివరాల మేరకు గ్రామానికి చెందిన ఉప్పర చిన్న రంగయ్య(40) బతుకుదెరువు కోసం భార్యాపిల్లలతో నాలుగు రోజుల కిందట కర్ణాటకలోని రాయచూరు జిల్లాలో పత్తి పనులకు వలస వెళ్లారు. రంగయ్య కడుపు నొప్పి తాళలేక చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

నడిరోడ్డుపై యువకుల వీరంగం



గాయపడిన బస్సు డ్రైవర్ శివలింగం

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : కర్నూలులో మంగళవారం సాయంత్రం ఇద్దరు యువకులు నడిరోడ్డుపై వీరంగం సృష్టించారు. నంద్యాల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు కర్నూలు నుంచి నంద్యాల వెళ్తోంది. లక్ష్మీనగర్ వద్ద ఇద్దరు యువకులు ద్విచక్ర వాహనంపై వెళ్తూ అత్యుత్సాహం ప్రదర్శిస్తూ బస్సుకు అడ్డుగా వచ్చారు. బస్సు డ్రైవర్ శివలింగం వారిని సక్రమంగా వెళ్లాలని సూచించగా కోపోద్రేకానికి గురైన యువకులు బస్సును వెంబడించారు. ప్రయాణికులను ఎక్కించుకునేందుకు మద్దూర్ నగర్ వద్ద డ్రైవరు బస్సు ఆపగా సదరు యువకులు బస్సు డ్రైవర్‌పై రాళ్లు విసిరి పరారయ్యారు. బస్సు డ్రైవర్ గాయపడగా కర్నూలు సి.క్యాంపు కూడలిలో బస్సు ఆపేశారు. సమీప ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స చేయించిన అనంతరం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుడు మూడో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితులను సీసీ ఫుటేజీల ద్వారా గుర్తించేందుకు పోలీసులు యత్నిస్తున్నారు.

పురపాలక కార్మికురాలిపై వైకాపా కౌన్సిలర్ దాడి



గాయపడిన నర్సమ్మ

ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే: ఆదోని పట్టణంలో హౌసింగ్ బోర్డులో మంగళవారం సాయంత్రం విధులు నిర్వహిస్తున్న మున్సిపల్ పొరుగు సేవల పారిశుద్ధ్య కార్మికురాలు నర్సమ్మపై ఐదో వార్డు కౌన్సిలర్ (వైకాపా) అశోక్, చిన్న మరికొందరు కలిసి దాడి చేశారని బాధితురాలు పేర్కొన్నారు. చికిత్స కోసం ఆదోని ప్రభుత్వ ఆస్పత్రిలో చేరారు. గతంలో ఉన్న మనస్పర్ధలను మనసులో పెట్టుకొని దాడికి పాల్పడ్డారన్నారు. దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయాన్ని 'న్యూస్‌టుడే' మూడో పట్టణ సీఐ రామలింగమయ్యతో ప్రస్తావించగా.. బాధితుల ఫిర్యాదు మేరకు మున్సిపల్ కార్మికురాలు నర్సమ్మ విధులకు ఆటంకం కలిగించడంతో పాటు దాడి చేసిన కౌన్సిలర్ అశోక్, చిన్నతో పాటు మరో ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఆదోని

• ఆదోని • ఆలూరు • పత్తికొండ

రైల్వేస్టేషన్‌లో లిఫ్ట్ సేవలు ప్రారంభం

ఆదోని ఎస్కేడీ కాలనీ, న్యూస్‌టుడే: రైల్వే ప్రయాణికుల సౌకర్యార్థం ఆదోని రైల్వేస్టేషన్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన లిఫ్ట్ సౌకర్యాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఆదోని రైల్వే స్టేషన్ మాస్టర్ ఎస్.వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం రైల్వేస్టేషన్‌లో ఏర్పాటు చేసిన మూడు లిఫ్టులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అమృత్ భారత్ పథకం కింద ఆదోని రైల్వేస్టేషన్ ఆధునికీకరణకు రూ.10.50 కోట్ల నిధులు మంజూరయ్యాయని.. ఇందులో భాగంగా సుమారు రూ.30 లక్షల వ్యయంతో మూడు లిఫ్టులు ఏర్పాటు చేసి ప్రారంభించామన్నారు. ముఖ్యంగా వృద్ధులు, మహిళలు, చిన్నారులు, దివ్యాంగులు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైల్వే ఎలక్ట్రీషియన్ ఇంజినీరు మహమ్మద్ ఇర్ఫాన్, వర్క్స్ ఇన్‌స్పెక్టర్ తేజస్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

హాలహర్వి, న్యూస్‌టుడే: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు రోగాలు వ్యాపించే ప్రమాదం ఉందని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని హాలహర్వి సర్పంచి మల్లికార్జున అన్నారు. స్థానిక ఎస్సీ కాలనీ, ఊరిబావి, బసవన్నగుడి చుట్టూ పరిసరాలను శుభ్రం చేయించారు. ఎలాంటి జబ్బులు దగ్గరకు రావొద్దని ఇందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని ఆయన కోరారు.

భోజుపురం(చిప్పగిరి), న్యూస్‌టుడే: **సమస్య:** చిప్పగిరి మండలం భోజుపురంలో వీధులు అధ్వానంగా ఉన్నాయి. సీసీ రోడ్లు నిర్మించాలి.

- నారాయణ, భోజుపురం

సమాధానం: సీసీ రహదారుల నిర్మాణానికి ఉపాధి హామీ పనుల్లో భాగంగా ప్రతిపాదనలు పంపాం. నిధులు వచ్చాయి. పనులు ప్రారంభిస్తాం.

- రమాదేవి, సర్పంచి, భోజుపురం

ఆస్పరి, న్యూస్‌టుడే: **సమస్య:** మా గ్రామంలో కొత్త కాలనీలో సీసీ రహదారి లేక బురదమయంగా ఉంది. వర్షం వస్తే కాలనీలన్నీ చిత్తడి చిత్తడిగా మారుతున్నాయి. సీసీ రహదార్లు, మురుగుకాల్వలు నిర్మాణపనులు చేపట్టాలి.

- లక్ష్మన్న, గ్రామస్థుడు, చిన్నహోతూరు

సమాధానం: ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తే కొత్త కాలనీలో సీసీ రహదారి, మురుగుకాల్వలు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం.

- కృష్ణ, కార్యదర్శి, చిన్నహోతూరు

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: **సమస్య:** దూదేకొండ గ్రామ బీసీ కాలనీలో జలజీవన్ ఇంటింటికీ కుళాయి పథకం కింద ఏర్పాటు చేసిన తాగునీటి పైపులు పలు చోట్ల లీకేజీ కారణంగా నీరు వృథాగా పోతోంది. దీంతో మిగతా కుళాయిలకు నీరు సక్రమంగా సరఫరా కావటంలేదు. లీకేజీ పైపులకు మరమ్మతులు చేపట్టి నీటి వృథాను అరికట్టాలి.

- హనుమన్న, బీసీ కాలనీ, దూదేకొండ

సమాధానం: కాలనీ మొత్తం ప్రతి ఇంటికీ కుళాయి ఏర్పాటు చేసి నీటి సమస్య లేకుండా చేశాం. పైపుల లీకేజీ విషయాన్ని గ్రామ పంచాయతీ కార్యదర్శి, నీటి సరఫరా విభాగం సిబ్బందికి సమాచారం అందించి పైపులకు మరమ్మతులు చేపట్టేలా చర్యలు తీసుకుంటాం.

- విష్ణువర్ధన్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, పత్తికొండ

పీడీఎస్‌యూ అర్ధ శతాబ్ది సభలు 24న

ఆలూరు, న్యూస్‌టుడే: పీడీఎస్‌యూ అర్ధ శతాబ్దోత్సవ సభలు జయప్రదం చేయాలని నియోజకవర్గ కార్యదర్శి మునిస్వామి కోరారు. ఈ నెల 24న హైదరాబాదులో, నవంబరు 5న విజయవాడలో జరిగే అర్ధ శతాబ్ది ఉత్సవాల సభలు నిర్వహిస్తామన్నారు. ఆలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో మంగళవారం గోడ పత్రాలు విడుదల చేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు హనుమేష్, మల్లినాయక్, దుర్గానాయక్, సురేష్ పాల్గొన్నారు.

చట్టాలపై రైతులకు అవగాహన అవసరం

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: సమాచారహక్కు చట్టంపై రైతులకు అవగాహన అవసరమని పత్తికొండ మండల వ్యవసాయాధికారి వెంకటరాముడు అన్నారు. పత్తికొండ వ్యవసాయ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన రైతు అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో డీఆర్‌సీ టెక్నికల్ ఏవో శశిధర్‌రెడ్డి, వ్యవసాయ విస్తరణాధికారులు రియాజ్, రుక్సానా పాల్గొన్నారు.

పల్లెలకు ప్రగతి కళ

✧ అభివృద్ధి పనులకు శ్రీకారం ✧ గ్రామాలకు కొత్తరూపు

మండలం	పనులు	నిధులు
ఆలూరు	31	రూ.2కోట్లు
ఆస్పరి	41	రూ.2కోట్లు
చిప్పగిరి	19	రూ.1.8కోట్లు
దేవనకొండ	30	198
హాలహర్వి	32	రూ.2కోట్లు
హోళగుంద	33	రూ.2కోట్లు



భూమిపూజలో గ్రామస్థులు


దేవనకొండ, న్యూస్‌టుడే: గత వైకాపా ప్రభుత్వం పల్లెల అభివృద్ధిని పూర్తిగా విస్మరించింది. వసతుల కల్పన మాట అటుంచితే.. కేంద్రం ఇచ్చిన ఆర్థిక నిధులు దారి మళ్లించింది. ఫలితంగా గ్రామాల్లో కనీస పారిశుద్ధ్య చర్యలు చేపట్టలేని పరిస్థితి నెలకొంది. పంచాయతీ ఖాతాలు ఖాళీ అయ్యాయి. పల్లె పాలకులు తలలు పట్టుకున్నారు. మరి కొందరు వినూత్న రీతిలో నిరసనలు తెలిపారు. అయినా అప్పటి పాలకుల్లో స్పందన కనిపించలేదు. ప్రస్తుతం కూటమి అధికారంలోకి రాగానే ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేసేలా నిర్ణయం తీసుకున్నారు.

ఎక్కడి పనులు అక్కడే..

2014-19 మధ్య కాలంలో నాటి తెదేపా ప్రభుత్వం ఉపాధి హామీ మెటీరియల్ ఫండ్‌ను మురుగు కాలువలు, సీసీ రహదారులు, అంగన్‌వాడీ భవన నిర్మాణాలకు వెచ్చించారు. తరువాత వచ్చిన వైకాపా ప్రభుత్వం సచివాలయ భవనాలు, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ క్లినిక్‌లకు వెచ్చించినా అవి పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాలేదు. చాలా చోట్ల అసంపూర్తిగా నిలిచాయి. దీంతో మిగిలిన పనులు పడకేశాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే ఆగస్టు 23న గ్రామసభలు నిర్వహించి పనులకు ఆమోదం తెలిపింది. ఈ నెల 14న పల్లె పండుగ వారోత్సవాలు ప్రారంభించారు.

రూ.11.78కోట్లతో పనులు

ఆలూరు నియోజకవర్గంలో ఆరు మండలాల్లో గ్రామసభలు నిర్వహించి 186 పనులకు ఆమోదం తెలిపారు. వాటికి రూ.11.78 కోట్లు కేటాయించారు. వీటిలో అధికంగా సీసీ రహదారులు, మురుగు కాల్వల నిర్మాణాలు చేపట్టనున్నారు. దేవనకొండ మండలంలో మినీ గోకులం 40 యూనిట్లకు గాను, రూ.90,78,500 నిధులు మంజూరైనట్లు ఏపీవో కృష్ణమూర్తి తెలిపారు.



ఖర్చు లెక్కలు బహిరంగమే

ఆలూరు మండలం హుళేబీడు గ్రామంలో పల్లె పండుగలో జరిగిన అభివృద్ధి పనుల వివరాలు అందరికీ తెలిసేలా ప్రదర్శిస్తున్నారు. గ్రామంలో రూ. 10 లక్షలతో 500 మీటర్ల సీసీరోడ్డు, అలాగే రూ.3.56 లక్షలతో మూడు పారం పాండ్స్, అలాగే రూ.4.60 లక్షలతో రెండు గోకులం షెడ్లు, 25.30 ఎకరాల్లో రూ.13.57 లక్షలతో పండ్లతోటలు పెంపకం, రూ.13.50 లక్షలతో మూడు పంటకాల్వల పునరుద్ధరణ చేపట్టనున్నట్లు అధికారులు ఏర్పాటు చేసిన చిత్రం అందరినీ ఆకట్టుకుంది. ఇందులో వైకాపా లాగా ఒకే రంగు కాకుండా అన్ని రకాల రంగులను ఇందులో వాడారు.

ఆలూరు గ్రామీణం, న్యూస్‌టుడే: పల్లె పండుగ కార్యక్రమంలో చేసే పనులు, వెచ్చించే నిధులు, ఆయా వివరాలు అందరికీ సులభంగా అర్థమయ్యేలా చిత్ర సహిత సూచికలు ఏర్పాటు చేస్తున్నారు. ఆయా పనుల చిత్రాలతో పాటు గణాంకాలను నమోదు చేస్తున్నారు. మహాత్మాగాంధీ, స్వచ్ఛభారత్, నరేగా లోగోలు, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చిత్రాలతో బోర్డు రూపొందించారు. ఇందులో నమోదు చేసిన సమాచారం చూసిన వెంటనే అందరికీ స్పష్టంగా సులభంగా అర్థమయ్యేలా ఉంది.

పల్లె కబుర్లు

ఢణాపురం(ఆదోని గ్రామీణం), న్యూస్‌టుడే: ఢణాపురం గ్రామంలో మంగళవారం రీ సర్వే సమస్యలపై గ్రామసభ నిర్వహించారు. ఆదోని రీ సర్వే డీటీ పెద్దయ్య రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆదోని మండల సర్వేయర్ ఈశ్వర్, వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

అగ్రహారం,(మద్దికెర), న్యూస్‌టుడే: అగ్రహారంలో రూ.30 లక్షలతో సిమెంటు రహదారి పనులకు భూమి పూజ చేశారు. జడ్పీటీసీ మాజీ సభ్యుడు పురుషోత్తమచౌదరి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు సుధాకరచౌదరి, తెదేపా నాయకులు శివశంకర్ పాల్గొన్నారు.

రామదుర్గం (చిప్పగిరి), న్యూస్‌టుడే : రామదుర్గంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. నాసిరకం విత్తనాలు, ఎరువులు వాడి నష్టపోరాదని వ్యవసాయాధికారిణి జయలక్ష్మి రైతులకు సూచించారు.

ఎద్దులదొడ్డి(తుగ్గలి), న్యూస్‌టుడే: ఎద్దులదొడ్డి గ్రామంలో మంగళవారం నిర్వహించిన గ్రామ సభలో మొత్తం 118 దరఖాస్తులు వచ్చినట్లు వీఆర్వో మల్లికార్జున తెలిపారు. వాటిలో ఎక్కువగా భూ విస్తీర్ణం ఆన్‌లైన్‌లో తక్కువగా ఉందని 82 ఫిర్యాదులు అందాయన్నారు. కార్యక్రమంలో సర్వేయర్ సుధాకర్, వీఆర్వో కాశిరంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

జూటూరు(పత్తికొండ పట్టణం), న్యూస్‌టుడే: జూటూర్ గ్రామానికి చెందిన వడ్డే సరసప్ప తన పొలంలో నీరు కట్టేందుకు వెళ్లినపుడు మోటారు వద్ద ఉన్న పాము కాటేసింది. స్థానికుల సాయంతో హుటాహుటిన ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

మద్దికెర, న్యూస్‌టుడే: మద్దికెరలోని బాలికల ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో పంచాయతీ నిధులతో నిర్మించిన ఫుట్‌పాత్‌ను సర్పంచి సుహాసిని, పంచాయతీ కార్యదర్శి మంగళవారం ప్రారంభించారు. ఈ స్థలాన్ని ఆక్రమించి బంకులు ఏర్పాటు చేసుకోగా.. ఇటీవలే వాటిని తొలగించి ఫుట్‌పాత్ నిర్మించారు.

మద్దికెర, న్యూస్‌టుడే: గ్రామంలో అక్రమ నిర్మాణాలు చేపడితే తొలగిస్తామని పంచాయతీ కార్యదర్శి శివకుమార్ అన్నారు. మద్దికెర పంచాయతీ సమావేశం సర్పంచి సుహాసిని అధ్యక్షతన మంగళవారం స్థానిక కార్యాలయంలో జరిగింది. పలు ఆక్రమణలపై చర్చించారు. కార్యక్రమంలో ఉప సర్పంచి ప్రమీలమ్మ, పంచాయతీ సలహాదారు ఆంజనేయులు, వార్డు సభ్యులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

మార్లమడికి (హొళగుంద), న్యూస్‌టుడే: మార్లమడికి గ్రామం హగరి వేదవతి నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఇసుక ట్రాక్టరును, మంగళవారం తెల్లవారుజామున పోలీసులు పట్టుకుని, కేసు నమోదు చేసినట్లు ఎస్సై బాల నరసింహులు తెలిపారు.

విద్యార్థుల రచనలు.. పదునైన ఆలోచనలు

ఆదోని విద్య, న్యూస్‌టుడే: ఆదోని పట్టణంలోని మిల్టన్ ఉన్నత పాఠశాలలో 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీల్లో భాగంగా మంగళవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొన్నారు. 'ఇంటర్నెట్ వినియోగం వల్ల లాభనష్టాలు, విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో 8, 9, పదో తరగతి విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ చాటి ప్రథమ స్థానంలో నిలిచిన ఎ.అశ్రిత, ద్వితీయ స్థానంలో వై.శ్రుతి, తృతీయ స్థానంలో నిలిచిన ఉమాలక్ష్మి అనే విద్యార్థులకు పాఠశాల కరెస్పాండెంట్ హెచ్.రమేశ్‌బాబు, ప్రిన్సిపల్ నాగరాజు, సీఈవో వెంకటేశు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రంగస్వామి, జయసింహ, ఉమర్, ఇబ్రహీం, నయూం, మెహర్, ఉన్నిసా తదితరులు పాల్గొన్నారు.



వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న పాఠశాల నిర్వాహకులు

వలసలు వెళ్లొద్దు.. పనులు కల్పిస్తాం

తుగ్గలి, న్యూస్‌టుడే: వ్యవసాయ కూలీలు ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లొద్దు, స్థానికంగానే ఉపాధి పనులు కల్పిస్తామని ఉపాధి ఏపీడీ పక్కీరప్ప అన్నారు. ఉపాధి కార్యాలయంలో సిబ్బందితో మంగళవారం సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో వలసలు వెళ్లే కుటుంబాలను గుర్తించి, వారితో మాట్లాడి పనులు కల్పించాల్సిన బాధ్యత క్షేత్రసహాయకులపై ఉందన్నారు. కార్యక్రమంలో ఏపీవో హేమసుందర్, ఇంచార్జ్ ఈసీ ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి



చాకలి విష్ణు (పాతచిత్రం)

దేవనకొండ, న్యూస్‌టుడే : కుటుంబ ఆర్థిక సమస్యలతో సతమవుతున్న ఓ యువకుడు పొలంలో గడ్డి మందుతాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని కొత్తపేటలో జరిగింది. పోలీసులు, స్థానికుల వివరాల మేరకు.. కొత్తపేట గ్రామానికి చెందిన నాగరాజు, ఈరమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు. వ్యవసాయం, మేకలు మేస్తూ జీవనం గడుపుతున్నారు. ఆగస్టులో విష్ణు తండ్రి నాగరాజు చనిపోయారు. కుటుంబ సమస్యలు పెరిగిపోయాయి. క్షణికావేశంతో చిన్న కుమారుడు విష్ణు (19) సెప్టెంబర్ 28న పొలంలో గడ్డి మందు తాగి ఆత్మహత్యానికి పాల్పడ్డాడు. కర్నూలు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మనస్తాపంతో బాలిక ఆత్మహత్య

తుగ్గలి, న్యూస్‌టుడే: తల్లిదండ్రులు పెళ్లి సంబంధాలు చూస్తున్నారని మనస్తాపంతో క్రిమిసంహారక మందు తాగి హేమలత(17) అనే బాలిక ఆత్మహత్య చేసుకొన్నట్లు జొన్నగిరి పోలీసులు మంగళవారం తెలిపారు. పైచింతలకొండ గ్రామానికి చెందిన అంజినయ్య పొలానికి మందు పిచికారీ చేస్తుండగా సాయంగా వెళ్లింది. ఎవరికీ తెలియకుండా బాలిక విషద్రావణం తాగింది. చాలా సేపటి తరువాత అస్వస్థతకు గురి కావడంతో తండ్రి అంజినయ్య చికిత్స కోసం ప్యాపిలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మరణించిందన్నారు. ఒక్కగానొక్క కుమార్తె మృతిచెందడంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు.

విద్యార్థులకు ఇబ్బందులు రానీయొద్దు



వసతిగృహంలో రికార్డులు పరిశీలిస్తున్న న్యాయమూర్తి హేమ

ఆలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: వసతి గృహంలో ఉండేలా విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు రానీయకుండా చూడాలని ఆలూరు జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి హేమ అన్నారు. ఆలూరులోని బాలికల వసతి గృహాన్ని ఆమె మంగళవారం పరిశీలించారు. విద్యార్థుల హాజరు పట్టికను, విద్యార్థులకు అన్నం వండే బియ్యాన్ని పరిశీలించారు. అనంతరం విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వసతి గృహ సంరక్షకురాలు సుజాత న్యాయమూర్తికి వివరాలు తెలిపారు.

ఆక్రమణకు అంతా సిద్ధం

పత్తికొండ పట్టణం, న్యూస్‌టుడే: పత్తికొండ పట్టణంలో ప్రభుత్వ స్థలాల ఆక్రమణలు రోజు రోజుకు పెరిగిపోతున్నాయి. శివారు ప్రాంతాలనే కాదు ఏకంగా ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణాలపైనా కన్నేస్తున్నారు అక్రమార్కులు. పత్తికొండలోని వ్యవసాయ సహాయ సంచాలకుల కార్యాలయం, తహసీల్దారు కార్యాలయం, మండల వ్యవసాయ కార్యాలయం, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం, పత్తికొండ రెవెన్యూ డివిజన్ కార్యాలయాలు ఒకే ఆవరణలో ఉన్నాయి. ఇన్ని కార్యాలయాలు ఉన్న ఆవరణలోని స్థలాన్ని శుభ్రం చేసి, మట్టి తోలించి చదునుచేశారు. ఏ శాఖ ఎవరికీ ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని చెబుతున్నా.. ఆక్రమణలకు రంగం మాత్రం సిద్ధమవుతోంది. ప్రభుత్వ స్థలాలను రక్షించాలని ప్రజలు కోరుతున్నారు.

☛ ఈ విషయాన్ని వ్యవసాయ సంచాలకుడు మోహన విజయ్ కుమార్‌తో ప్రస్తావించగా.. ఎవరికీ అనుమతి ఇవ్వలేదన్నారు. ఆర్ఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. తాము ఎవరికీ ఎలాంటి అనుమతులు కానీ, పత్రాలు కానీ జారీ చేయలేదన్నారు.



ఆక్రమణకు సిద్ధం చేసిన స్థలం

రోడ్డు ప్రమాదంలో దుర్మరణం

కృష్ణగిరి, న్యూస్‌టుడే: అమకతాడు టోల్ ప్లాజా సమీపంలో 44 నెంబరు జాతీయ రహదారిపై మంగళవారం తెల్లవారు జామున జరిగిన రోడ్డు ప్రమాదం జరిగింది. అవుకు మండలం రామాపురం గ్రామానికి చెందిన వాహన చోదకుడు పేరం సుదర్శన్‌రెడ్డి (24) మృతిచెందినట్లు ఎస్సై కె.మల్లికార్జున తెలిపారు. అనంతపురం నుంచి కర్నూలు మార్కెట్‌కు వేరుసెనగ కాయలు తరలిస్తున్న గూడ్స్ వాహనం అదుపు తప్పి డీవైడర్‌ను ఢీకొనడంతో అందులో వాహనం నడుపుతున్న పేరం సుదర్శన్‌రెడ్డికి తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు.

టీ బంకు విషయంలో ఘర్షణ

పెద్దతుంబళం(ఆదోని గ్రామీణం), న్యూస్‌టుడే: పెద్దతుంబళం గ్రామంలో టీ బంకు విషయంలో ఇరు వర్గాలు ఘర్షణ పడిన ఘటనలో కేసులు నమోదు చేసినట్లు పెద్దతుంబళం ఎస్సై మహేష్‌కుమార్ మంగళవారం తెలిపారు.

జూదరుల అరెస్టు

ఆలూరు గ్రామీణ, న్యూస్‌టుడే : అరికెర కొండల్లో పేకాట ఆడుతున్న 12 మంది అరెస్టుచేసినట్లు పత్తికొండ డీఎస్పీ వెంకటరామయ్య, ఆలూరు ఎస్సై వెంకటనరసింహులు తెలిపారు. సమీపంలో పంట పొల్లాలో ఆడుతున్న వారిపై దాడులు చేసి పట్టుకుని, వారి వద్ద నుంచి రూ. 1.68 లక్షల నగదు, 9 చరవాణులు, నాలుగు కార్లు, నాలుగు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. దాడులో హెడ్ కానిస్టేబుల్ జానీవాకర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు ఆర్థిక సాయం

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: రెండు రోజుల కిందట చందోలి గ్రామంలో తల్లి మరణంతో అనాథలుగా మారిన చిన్నారులకు సాయం అందించేందుకు అండగా నిలుస్తున్నారు. దేవనకొండ మండలంలోని నల్లచెలిమల గ్రామానికి చెందిన పలువురు దాతలు మంగళవారం పిల్లలకు రూ. 20వేలు, తుగ్గలి మండలంలోని రాంపల్లి, అనంతపురం, మద్దికెర, పత్తికొండ తదితర ప్రాంతాలకు చెందిన పలువురు మానవతావాదులు చిన్నారులకు అండగా ఉండేందుకు ముందుకు వచ్చి ఆర్థిక సాయం చేస్తున్నారు. స్పందిస్తున్న దాతలకు చిన్నారులు, బంధువులు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.



చిన్నారులకు ఆర్థిక సాయం అందిస్తున్న నల్లచెలిమల గ్రామస్థులు



వాగ్వాదానికి దిగిన కాలనీ వాసులు

రహదారి కొలతలపై అభ్యంతరం

దూదేకొండ(పత్తికొండ గ్రామీణం), న్యూస్‌టుడే: పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా దూదేకొండ బీసీ కాలనీలో సీసీ రహదారులు ఏర్పాటు చేసేందుకు అధికారులు పూనుకోగా రహదారి వెడల్పుపై కాలనీవాసులు అభ్యంతరం అభ్యంతరం వ్యక్తం చేశారు. బీసీ కాలనీలో మూడు మీటర్ల వెడల్పుతో సీసీ రహదారుల ఏర్పాటులో భాగంగా మట్టిపనులు ప్రారంభించారు. కనీసం నాలుగు మీటర్లు వేయాలని కాలనీవాసులు కోరారు. అక్రమ నిర్మాణాలు చేపట్టే ప్రమాదముందని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. కాలనీవాసుల అభ్యంతరాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారమయ్యేలా చూస్తామని పంచాయతీరాజ్‌శాఖ ఏఈ వెంకటేశ్వర్లు తెలిపారు.

అవకాశాలను అందిపుచ్చుకోవాలి

పత్తికొండ పట్టణం, న్యూస్‌టుడే: అందుబాటులో ఉన్న అవకాశాలను అందిపుచ్చుకోవాలని పత్తికొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ మాధురి అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఉద్యోగ మేళా నిర్వహించారు. పలు కంపెనీలు ఇందులో పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహించాయి. వివిధ ప్రాంతాల నుంచి 78 మంది పాల్గొన్నారు. ఇందులో 28 మంది ఉద్యోగం సాధించారని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎస్ఎస్‌డీసీ ఎన్‌టీఓ శ్రీనివాసులు, నైపుణ్యాభివృద్ధి సమన్వయకర్త ఏకే అల్తాఫ్ మరియు కళాశాల బృందం పాల్గొని విజయవంతం చేశారు.



నియామక పత్రాలు చూపుతున్న విద్యార్థులు

దారి అంచున గోతులు.. వెళ్తే అంతే సంగతులు

✶ కేబుల్ మరమ్మతులతో ఇక్కట్లు ✶ అడుగడుగునా గండాలే!



చిన్నహుల్తి ప్రాథమిక పాఠశాల సమీపంలో వదిలేసిన గుంత

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: పత్తికొండ-ఆదోని- గుత్తి ప్రధాన రహదారికి ఇరువైపులా చేపట్టిన కేబుల్ నెట్‌వర్క్ పనులతో రహదారులు ఛిద్రమవుతున్నాయి. అసలే ఇరుకు దారులు, వర్షాకాలం ఏ మాత్రం ఏమరుపాటుగా ఉన్నా.. వాహనాలు రహదారుల అంచులకు వెళ్తే అంతే సంగతులు. అధిక లోడుతో వెళ్తున్న భారీ వాహనాలు ఇటీవల ఈ మార్గంలో పలు చోట్ల మట్టిలో కూరుకుపోయి బోల్తా పడిన ఘటనలు ఉన్నాయి. కేబుల్ నెట్‌వర్క్ పనులు ప్రధాన రహదారికి ఆనుకొని చేపట్టారు. పనులు పూర్తయినా.. గుత్తేదారులు గుంతలను పూడ్చకుండా అలాగే వదిలేశారు. దీంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ఆయా గ్రామాల ప్రజలు, వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని రోజులుగా ఎడతెరిపిలేని వర్షాలతో గుంతల్లో నీరు చేరి మరింత ప్రమాదకరంగా మారాయి.

బోల్తాపడుతున్న వాహనాలు

పత్తికొండ పట్టణ శివారులోని ఆదోని రోడ్డులో హంద్రీనీవా కాల్వ సమీపంలో, పత్తికొండ ఈరన్నస్వామి ఆలయ సమీపంలో, చిన్నహుల్తి ప్రాథమిక పాఠశాల వద్ద, దేవనబండ గ్రామంలోని ప్రధాన రహదారిపై ఇలా పలుచోట్ల కేబుల్ పనుల నిమిత్తం పెద్ద పెద్ద గోతులు తవ్వారు. కొన్నిచోట్ల కనీసం వాటి చుట్టూ ప్రమాదాల హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేయలేదు. దీంతో రాత్రి సమయాల్లో వెళ్లే వాహనాలు ఇరుక్కుపోవడం, బోల్తా పడుతున్నాయి. ఇటీవల గుత్తి బైపాస్ రోడ్డులో చక్కెరలోడుతో వెళ్తున్న లారీ బోల్తాపడగా.. దాన్ని పైకి లాగేందుకు మూడు రోజుల సమయం పట్టింది. ఇలాంటివి జరిగినపుడు రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోందని ప్రయాణికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఆయా మార్గాల్లో అసంపూర్తిగా వదిలేసిన పనులను పూర్తి చేసి, గుంతలను పూడ్చాలని వాహనదారులు కోరుతున్నారు.

అసంపూర్తి పనులపై ఫిర్యాదు

- శ్వేత, ఆర్‌అండ్‌బీ జేఈ, పత్తికొండ

కొన్ని నెలలుగా పత్తికొండ ప్రాంతంలో జరుగుతున్న కేబుల్ పనులతో ప్రధాన రహదారులు తీవ్రంగా దెబ్బతింటున్నాయి. ఎక్కడ పడితే అక్కడ గుంతలు వదిలేసి వెళ్తున్నారు. దీంతో రహదారి ప్రమాదాలు అధికమవుతున్నాయి. ఈ మేరకు గుత్తేదారులపై పోలీసులకు, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశాం.

గత నెలలో పత్తికొండ-గుత్తి బైపాస్ రహదారిలో బోల్తాపడిన లారీ



అతుకులతోనే సరి.. శాశ్వత పనులు లేవుమరి

☛ ఏళ్ల తరబడి మట్టి దారులే దిక్కు ☛ హౌసింగ్‌బోర్డు కాలనీవాసుల అవస్థ



నాణ్యత లేని ప్యాచ్ పనులతో తేలిన కంకర

ఆదోని పాతపట్టణం, న్యూస్‌టుడే: ఆదోని పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీ ఏర్పడి ఏళ్లు గడుస్తున్నా.. నేటికీ అసౌకర్యాలే రాజ్యమేలుతున్నాయి. ఇక్కడి ప్రాంతంలో హెచ్ఐజీ, ఎంఐజీ, ఎల్ఐజీ, ఏపీహెచ్‌బీ కాలనీల్లో సుమారు వెయ్యికి పైగా నివాసాలున్నాయి. రాజకీయ నాయకులు, వ్యాపారవేత్తలు, ఉద్యోగులు, పురప్రముఖులు నివాసం ఉంటున్నారు. పురపాలక సంఘానికి ఆదాయం తెచ్చిపెట్టడంలో మొదటి స్థానంలో ఉంది ఈ ప్రాంతం. అభివృద్ధిలో మాత్రం ఆఖరులో నిలిచింది.

నాణ్యత మాయం

కొన్ని వీధుల్లో చేపట్టిన రహదారుల పనుల్లో నాణ్యత లోపించి, తారు చెదిరిపోయి.. కంకర తేలుతోంది. కొత్తగా నిర్మించిన రెండు పార్కులు సైతం నిర్వహణ సవ్యంగా లేక జనం ఆహ్లాదానికి దూరమవుతున్నారు. వీటిలో ఆట, క్రీడా పరికరాలు ధ్వంసమయ్యాయి. వృద్ధులకు వాకింగ్ ట్రాక్ లేకపోవడం పార్కులకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది.

నిత్యం అవే సమస్యలు

ఇక్కడ నేటికీ మట్టి దారులే దర్శనమిస్తున్నాయి. గుంతలు పడి, రాళ్లు తేలిన దారులపై జనం రాత్రిళ్లు నడవాలంటే.. కింద పడి గాయాలపాలవుతున్నారు. మురుగు కాలువలు అస్తవ్యస్తంగా ఉన్నాయి. చిన్న వర్షం కురిసినా ఇళ్ల ముందు బురద మేట వేస్తోంది. మురుగు కాల్వల్లో పూడిక చేరి కంపు కొడుతున్నాయి. పై ప్రాంతాల్లో ఆక్రమణలు, కొండను ఆనుకుని ఉన్న కాలనీలు, మరో వైపు రాంజల చెరువు ఉండటంతో.. వర్షం వస్తే చాలు ఇళ్లు జలమయం అవుతాయి.


కాలనీలో స్వచ్ఛవాతావరణం ఏర్పాటుకు వంద శాతం అవకాశాలున్నా, పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రజలు వాపోతున్నారు.

ఆదర్శ వార్డుగా తీర్చిదిద్దాలి - ప్రవీణ్, ప్రైవేటు ఉద్యోగి



హౌసింగ్‌బోర్డు కాలనీని అన్ని రకాలుగా అభివృద్ధి చేసి, ఆదర్శ వార్డుగా తీర్చిదిద్దేందుకు అవకాశాలున్నాయి. పాలకులు ఇక్కడి వార్డును పట్టించుకోవడం లేదు. ఈ కాలనీ నుంచి ఎంతో ఆదాయం వస్తున్నా.. కనీస అభివృద్ధి చేయాలి. 40 ఏళ్లుగా రహదారులు లేవు. కాల్వలు శుభ్రం చేయడం లేదు.

పార్కుల నిర్వహణ సరిగ్గా లేదు - శ్రీనివాసులు, కాలనీవాసి



కాలనీలో నాలుగైదు పార్కులున్నాయి. వీటి నిర్వహణ సరిగా లేదు. ఆరోగ్యం విషయంలో వైద్యులు రోజు నడక సాగించాలని సూచిసుస్తున్నారు. పార్కులో వాకింగ్ ట్రాక్‌లు లేవు. ఉన్న వాటిని సరిగ్గా నిర్వహించడం లేదు. ఎక్కడో రాంజల చెరువు గట్టుపై పెట్టారు. వ్యాయామ పరికరాలు ధ్వంసమయ్యాయి.

సమస్యల పరిష్కారానికి సహకరించండి



ఎంపీడీవోను సన్మానిస్తున్న కేడీసీ సభ్యులు

కోడుమూరు గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణంలో దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి సహకరించాలని కొత్తగా వచ్చిన ఎంపీడీవో రాముడును కోడుమూరు అభివృద్ధి కమిటీ సభ్యులు కోరారు. మంగళవారం వారు మండల పరిషత్తు కార్యాలయంలో ఎంపీడీవోను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. తాగునీరు, రహదారి విస్తర్ణ, గ్రంథాలయ తదితర సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కమిటీ వ్యవస్థాపకుడు కృష్ణయ్య, అధ్యక్షుడు షాకీర్, కార్యదర్శి జయన్న, గౌరవాధ్యక్షుడు రాముడు, సభ్యులు ఉసేనప్పస్వామి, హనుమంతు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు

• ఎమ్మిగనూరు • మంత్రాలయం • కోడుమూరు

వైభవంగా నెల పూజోత్సవం

గోనెగండ్ల, న్యూస్‌టుడే: గోనెగండ్లలోని చింతలాయునిస్వామి, నల్లారెడ్డి స్వాముల ఆలయంలో ఆలయ కమిటీ సభ్యులు, ఆలయ ధర్మకర్త ఆధ్వర్యంలో మంగళవారం నెల పూజోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. రాత్రిపూట ఆలయ పరిసరాల్లో స్వామివారికి పల్లకి సేవ చేశారు. వివిధ గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి దర్శించుకున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM) మంత్రాలయం : 98859 97892 గోనెగండ్ల : 80085 73827

నందవరం: **సమస్య:** నందవరంలోని ఎస్సీ కాలనీ సమీపంలో రహదారులపై చెత్తాచెదారం వేయడంతో దుర్వాసన వస్తోంది. అధికారులు సమస్యను పరిష్కరించగలరు. **- రంగన్న, నందవరం**

సమాధానం: సమస్యను సంబంధిత అధికారులు, పాలకుల దృష్టికి తీసుకెళ్లి త్వరలోనే పరిష్కరిస్తాం. **- సందీప్, ఈవోఆర్డీ, నందవరం**

ఇరుకు గదులు.. ఒంటపట్టని పాఠాలు

• ఇబ్బందుల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు
• అదనపు గదులు నిర్మిస్తేనే సమస్యకు పరిష్కారం

ప్రభుత్వ పాఠశాలల్లో గదుల కొరతతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో పాఠశాలల్లో నాడు-నేడు కింద గదుల నిర్మాణాలు ప్రారంభించినా నిధులు కేటాయించకపోవడంతో ఎక్కడా పూర్తి స్థాయిలో అందుబాటులోకి రాలేదు. దీంతో విద్యార్థులకు ఒకే గదిలో రెండు, మూడు తరగతులు నిర్వహిస్తున్నారు. ఇరుకిరుకుగా కూర్చోవడంతో పాఠాలు ఒంటపట్టని పరిస్థితి నెలకొంది. - న్యూస్‌టుడే, కోసిగి

మండలం | పాఠశాల | విద్యార్థుల సంఖ్య | ఒకే గది కూర్చుంటున్నవారు | ఎన్ని గదులు అవసరం



ప్రాథమికకు రెండు.. ఉన్నతకు నాలుగు

గోనెగండ్ల | వేముగోడు జడ్పీ ఉన్నత పాఠశాల | 460 | ప్రాథమిక తరగతులు | నాలుగు

గోనెగండ్ల, న్యూస్‌టుడే: గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో జడ్పీ ఉన్నత పాఠశాల కొనసాగుతోంది. గతేడాది విలీనంతో విద్యార్థుల సంఖ్య పెరిగి గదుల కొరత ఏర్పడింది. ఇక్కడ మొత్తం ఆరు గదులున్నాయి. రెండు గదుల్లో ప్రాథమిక పాఠశాల, మిగిలిన నాలుగు గదుల్లో ఉన్నత పాఠశాల విద్యార్థులకు బోధిస్తున్నారు.



ప్రైవేటుకు వెళ్లిన 50 మంది విద్యార్థులు

గూడూరు | పొన్నకల్లు ప్రాథమిక పాఠశాల | 47 | మూడు తరగతులు | రెండు

గూడూరు, న్యూస్‌టుడే: పొన్నకల్లు ప్రాథమిక పాఠశాలలో ఒకే గదిలో 1, 2, 3 తరగతుల విద్యార్థులను కూర్చోబెడుతున్నారు. 1, 2 తరగతుల విద్యార్థులకు పాఠాలు బోధించేందుకు 3వ తరగతి వారిని, వీరికి బోధించాలంటే 1, 2 తరగతుల వారిని వరండాలో కూర్చోబెడుతున్నారు. దీంతో 50 మంది విద్యార్థులు గ్రామం నుంచి ప్రైవేటు పాఠశాలకు వెళ్తున్నారు.

పరిశీలన

ఆరు గదుల్లో పది తరగతులు

మంత్రాలయం | చిలకలడోణ ప్రాథమిక పాఠశాల | ప్రాథమిక 256 ఉన్నత 346 | మూడు తరగతులవారు | తొమ్మిది

మంత్రాలయం, న్యూస్‌టుడే: చిలకలడోణ ప్రాథమిక పాఠశాలలో ఆరు గదులున్నాయి. నాలుగింటిలో 1 నుంచి 5 వరకు, మిగిలిన రెండింటిలో ఉన్నత పాఠశాల విద్యార్థులకు బోధిస్తున్నారు. ఒకే గదిలో, వరండాలో రెండు, మూడు తరగతులవారిని కూర్చోబెట్టి బోధిస్తున్నారు.



వరండాలో నిర్వహణ

కోసిగి | జంపాపురం మండల పరిషత్తు పాఠశాల | 165 | మూడు తరగతులు | ఆరు

కోసిగి, న్యూస్‌టుడే: పాఠశాలలో 4, 5వ తరగతులకు మాత్రమే రెండు గదులుండగా, మిగతా 1, 2, 3వ తరగతి విద్యార్థులకు గదులు లేకపోవడంతో వరండాల్లో కూర్చోబెట్టి పాఠాలు బోధిస్తున్నారు. మూడు గదుల్లో ఇరుకిరుకుగా కూర్చుంటున్నారు.



తారాపురానికి తాగునీటి సరఫరా



కుళాయి వద్ద నీటిని పట్టుకుంటున్న గ్రామస్థులు

పెద్దకడబూరు, న్యూస్‌టుడే: మండలంలోని తారాపురం గ్రామానికి వారం, పది రోజులకోసారి తాగునీటిని సరఫరా చేస్తుండటంతో గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై మంగళవారం ఈనాడులో 'తారాపురంలో తాగునీటి తంటాలు' శీర్షికతో వచ్చిన కథనం ప్రచురితమైంది. దీనికి జిల్లా తాగునీటి సరఫరా విభాగం ఎస్ఈ స్పందించారు. తక్షణమే తారాపురం గ్రామానికి తాగునీటిని సరఫరా చేయాలని మండల ఏఈ సాయికుమార్‌ను ఆదేశించారు. దీంతో ఏఈ వెంటనే గ్రామాన్ని సందర్శించి నీటి సరఫరా సిబ్బందితో మాట్లాడి కుళాయిలకు నీటిని సరఫరా చేయించారు. గ్రామానికి నిత్యం తాగునీటిని సరఫరా చేయాలని, లేదంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

తెదేపాలోకి వైకాపా కౌన్సిలర్ల చేరిక



తెదేపాలో చేరిన కౌన్సిలర్లతో ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి

ఎమ్మిగనూరు గ్రామీణం, న్యూస్‌టుడే: పురపాలక ఛైర్మన్ రఘు తల్లి సరోజతోపాటు వైకాపా కౌన్సిలర్లు స్వాతి, అబ్దుల్ వాహీద్ తమ అనుచరులతో కలిసి మంగళవారం ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి సమక్షంలో తెదేపాలో చేరారు. ఎమ్మెల్యే వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు పేర్కొన్నారు.

ఆగని వలస.. ఇదీ వరుస

మండలంలోని రాళ్లదొడ్డి నుంచి మంగళవారం 20 కుటుంబాలకుపైగా కర్ణాటకకు వలస వెళ్లారు. దసరా పండగ ముగియడంతో మండలంలోని గుడేకల్లు, కందనాతి, కడివెళ్ల తదితర గ్రామాల నుంచి తెలంగాణ, కర్ణాటక, గుంటూరు ప్రాంతాలకు పత్తితీత పనులకు వెళ్తున్నారు. ఇప్పటికే వంద కుటుంబాల వరకు వెళ్లినట్లు ఆయా గ్రామాల ప్రజలు తెలియజేశారు. అక్కడ పత్తితీతకు కిలో రూ.12 వరకు కూలీ ఇస్తుండటంతో చదువుతున్న విద్యార్థులను కూడా వెంట తీసుకెళ్తున్నారు. స్థానికంగా వ్యవసాయ పనులున్నా గిట్టుబాటు కావడం లేదని చెబుతున్నారు.

– న్యూస్‌టుడే, ఎమ్మిగనూరు గ్రామీణం



సీసీ దారి నిర్మించి.. కాల్వలు మరిచి

మండలంలోని బురాన్‌దొడ్డి గ్రామంలో సచివాలయం సమీపంలో సీసీ రహదారి నిర్మించారు, కానీ కాల్వలు నిర్మించలేదు. దీంతో సీసీ దారెంట మురుగు ప్రవాహం దిగువకు చేరి బురదమయమైంది. సమీపంలోని నివాసితులు దుర్వాసనతో ఇళ్ల ఎదుట కూర్చోలేక పోతున్నామని వాపోతున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి సీసీ రహదారికిరువైపులా కాల్వలు నిర్మించాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, బురాన్‌దొడ్డి (సి.బెళగల్)



రోడ్డు పక్కనే చెత్త పనులు

కోడుమూరులోని మెయిన్‌బజార్ నుంచి కల్లుపెంట, చిన్నబోయగేరికి వెళ్లే దారిలో చెత్త పడేశారు. దుర్వాసన వస్తుండటంతో పాదచారులు ముక్కు మూసుకుని రాకపోకలు సాగిస్తున్నారు. గాలి వచ్చినప్పుడు చెత్తంతా ఇళ్ల ముందుకు వస్తోందని స్థానికులు వాపోతున్నారు. చెత్తను తొలగించాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, కోడుమూరు గ్రామీణం



పెద్దమర్రివీడులో జ్వరాలపై సర్వే

గోనెగండ్ల, న్యూస్‌టుడే: మండలంలోని పెద్దమర్రివీడులో ఫీవర్, లార్వా సర్వే చేపట్టినట్లు మలేరియా సబ్ యూనిట్ అధికారి సాయిబాబా, శాంతమ్మ, హనుమంతు మంగళవారం తెలిపారు. గ్రామంలో దోమలు పెరగకుండా మురుగు నిల్వలను పంచాయతీ సిబ్బందితో శుభ్రం చేయించామన్నారు.

ఉద్యోగాలకు ఇరవై మంది ఎంపిక

కోడుమూరు గ్రామీణం, న్యూస్‌టుడే: పలు కంపెనీల్లో ఉద్యోగాలకు 20 మంది నిరుద్యోగ యువత ఎంపికైనట్లు ప్రిన్సిపల్ పద్మావతి పేర్కొన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం ఉద్యోగ మేళా నిర్వహించారు. 89 మంది నిరుద్యోగులు హాజరైనట్లు పేర్కొన్నారు. ప్లేస్‌మెంట్ అధికారి సాయితేజ, నైపుణ్యాభివృద్ధి సమన్వయకర్త హరిబాబు, ఏపీఎస్ఎస్‌డీసీ, యంగ్ ఇండియా తదితర పలు కంపెనీల సిబ్బంది పాల్గొన్నారు.

ఫిర్యాదుపై సీఐ విచారణ

గూడూరు, న్యూస్‌టుడే: దుకాణాల మధ్యలో మద్యం దుకాణం ఏర్పాటు చేయడంపై స్థానికులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కోడుమూరు ఎక్సైజ్ సీఐ మంజుల మంగళవారం మద్యం దుకాణాన్ని సందర్శించి విచారించారు. వాహనాలు నిలపడం వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం కలుగడంతోపాటు అక్కడే మద్యం తాగినవారితో ఇబ్బందులు తలెత్తుతున్నాయని దుకాణదారులు ఆమెకు వివరించారు.

ఉరుకుంద ఈరన్న స్వామి హుండీ ఆదాయం రూ.1.08 కోట్లు

కౌతాళం, న్యూస్‌టుడే: మండలంలోని ఉరుకుంద నరసింహ ఈరన్న స్వామి ఆలయ హుండీని మంగళవారం లెక్కించారు. ఒక నెలకు సంబంధించిన ఆదాయం నగదు రూ.1,08,37,696, బంగారం 61.200 గ్రాములు, వెండి 14.700 కిలోలు వచ్చింది. అన్నదాన సత్రం హుండీ ద్వారా రూ.61,422 వచ్చినట్లు ఆలయ ఈవో విజయరాజు పేర్కొన్నారు. హుండీ పర్యవేక్షణాధికారి వెంకటేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

సర్వమత సమ్మేళనానికి పీఠాధిపతికి ఆహ్వానం



పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థులను సన్మానిస్తున్న బిషప్ డిసౌజ, ఫాదర్ ఇవాన్ పింటో

ఆధ్యాత్మికం

మంత్రాలయం, న్యూస్‌టుడే: కర్ణాటక రాష్ట్రం బళ్లారిలో నవంబరు 27న నిర్వహించనున్న సర్వమత సమ్మేళనానికి హాజరు కావాలని మంత్రాలయం రాఘవేంద్ర స్వామి పీఠాధిపతి సుబుదేంద్రతీర్థులను బళ్లారికి చెందిన బిషప్ డిసౌజా, ఫాదర్ ఇవాన్ పింటో ఆహ్వానించారు. మంగళవారం వారు శ్రీమఠానికి చేరుకుని పీఠాధిపతితో సమావేశమయ్యారు. సుబుదేంద్రతీర్థులను సన్మానించి ఆహ్వాన పత్రిక అందజేశారు. పీఠాధిపతి వారికి శేషవస్త్రం, జ్ఞాపిక అందించి సత్కరించారు.

సంపూర్ణ సేవకు రూ.2 లక్ష విరాళం

మంత్రాలయం, న్యూస్‌టుడే: కర్ణాటక రాష్ట్రం బెంగళూరుకు చెందిన గోపాలకృష్ణ అనే భక్తుడు రాఘవేంద్రస్వామి మఠానికి ఒకరోజు సంపూర్ణ సేవకు రూ.2 లక్షలు విరాళం అందించినట్లు మఠం మేనేజర్ వెంకటేశ్ జోషి తెలిపారు. వారు మంగళవారం మంత్రాలయం చేరుకుని గ్రామదేవత మంచాలమ్మ, రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని దర్శించుకున్నారు.

గ్రామసభలతో భూసమస్యల పరిష్కారం



ఐరన్‌బండలో సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బాధితులు

గోనెగండ్ల, న్యూస్‌టుడే: గ్రామసభల్లో రైతులు ఇచ్చిన వినతులను రెండు వారాల్లో పరిష్కరిస్తామని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ అన్నారు. మంగళవారం ఆయన గోనెగండ్ల మండలంలోని ఐరన్‌బండలో నిర్వహించిన గ్రామసభను పరిశీలించారు. ఉప తహసీల్దార్ విష్ణుప్రసాద్, డీఐఎస్ శ్రీనివాసరాజు, రీసర్వే ఉప తహసీల్దార్ శిరీష పాల్గొన్నారు.

చిన్నకడబూరులో సబ్ కలెక్టర్ పర్యటన

పెద్దకడబూరు, న్యూస్‌టుడే: మండలంలోని చిన్నకడబూరు గ్రామాన్ని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ మంగళవారం సందర్శించారు. గ్రామంలో రెవెన్యూ అధికారులు నిర్వహిస్తున్న భూరీసర్వే సభను పరిశీలించారు. ఉప తహసీల్దార్ గీతాప్రియదర్శిని, మండల సర్వేయర్ తేజశ్విని, గ్రామ పరిపాలనాధికారి గురురాజారావు పాల్గొన్నారు.

బూడిదపాడులో..



మాట్లాడుతున్న తహసీల్దార్ రామాంజనేయులు

గూడూరు గ్రామీణం, న్యూస్‌టుడే: గూడూరు మండలంలోని బూడిదపాడు గ్రామంలో మంగళవారం తహసీల్దార రామాంజనేయులు ఆధ్వర్యంలో రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రీసర్వేలో భూసమస్యలు ఏమైనా ఉంటే దరఖాస్తులు ఇవ్వాలని కోరారు. వాటిని పరిశీలించి న్యాయం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బూడిదపాడు సర్పంచి పార్వతి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



మాట్లాడుతున్న డిప్యూటీ కమిషనర్ శ్రీదేవి

ఎమ్మిగనూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: కొత్తగా ఏర్పాటు చేసిన మద్యం దుకాణాల నిర్వాహకులు నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఎక్సైజ్, ప్రొహిబిషన్ డిప్యూటీ కమిషనర్ పి.శ్రీదేవి అన్నారు. మంగళవారం ఆమె ఎక్సైజ్, ప్రొహిబిషన్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. పట్టణంలో ఏర్పాటు చేసిన మద్యం దుకాణాలను పరిశీలించారు. గొలుసు దుకాణాల నిర్మూలనలో భాగంగా గతంలోకంటే ఎక్కువగా మద్యం దుకాణాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఆమె వెంట అసిస్టెంట్ కమిషనర్ హనుమంతరావు, ఎక్సైజ్ సీఐ రమేశ్‌రెడ్డి, ఎస్సై ఇస్మాయిల్ ఉన్నారు.

వలసలు నివారించాలని ధర్నా

ఎమ్మిగనూరు గ్రామీణం, న్యూస్‌టుడే: పశ్చిమ ప్రాంతంలో గ్రామాల నుంచి వలసలు పెరిగాయని, వీటిని నివారించి ఉపాధి పనులు కల్పించాలని మంగళవారం సీపీఐ ఆధ్వర్యంలో సోమప్ప కూడలిలో ధర్నా చేపట్టారు. పట్టణ కార్యదర్శి జి.రంగన్న, మంత్రాలయం నియోజకవర్గ నాయకుడు భాస్కర్ యాదవ్ మాట్లాడారు. ఉపాధి హామీ పనులు 200 రోజులు కల్పించి కనీస వేతనం రూ.600 ఇవ్వాలని డిమాండు చేశారు. ధర్నాలో సీపీఐ, ప్రజా సంఘాల నాయకులు చిన్నన్న, తిమ్మగురుడు, బజారి, ఖాదావలి, విరుపాక్షినాయుడు, జబ్బార్, మాలిక్, వెంకటేశ్వర్లు, విజేంద్ర, రామాంజి, మల్లికార్జునగౌడ్ పాల్గొన్నారు.



సోమప్ప కూడలిలో ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

సమాచార హక్కు చట్టంపై అవగాహన

సి.బెళగల్ గ్రామీణం, న్యూస్‌టుడే: సి.బెళగల్‌లోని రైతుసేవా కేంద్రంలో ఏవో మల్లేశ్‌కుమార్ మంగళవారం రైతులకు సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పించారు. ప్రభుత్వ శాఖల్లోని సమాచారం ఎలా పొందవచ్చో వివరించారు. అనంతరం మాట్లాడుతూ.. పంటల సాగులో విత్తనాల ఎంపిక కీలకమన్నారు. ఎరువులు, విత్తనాలు, కొనుగోలు చేసేప్పుడు రసీదులు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. తయారీదారుల వివరాలు తెలుసుకుని చెల్లింపు తేదీ చూసి తీసుకోవాలన్నారు.

ద్రోన్‌తో పురుగుమందు పిచికారీ సులభం



చిరుతాపల్లిలో డ్రోన్‌పై అవగాహన కల్పిస్తున్న అధికారులు

కౌతాళం, న్యూస్‌టుడే: డ్రోన్‌తో పంటలకు పురుగుమందు పిచికారీ సులభంగా వేసుకోవచ్చని ఏవో శేషాద్రి అన్నారు. మంగళవారం మండలంలోని ఉరుకుంద, చిరుతాపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తోంది నిర్వహించారు. అధిక వర్షాలతో పంటలను ఎలా సంరక్షించుకోవాలన్న దానిపై రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. చిరుతాపల్లి గ్రామంలో మహేంద్రరెడ్డి పొలంలో డ్రోన్ ద్వారా పురుగుమందు ఎలా స్ప్రే చేయాలో అవగాహన కల్పించారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

పెద్దకడబూరు, న్యూస్‌టుడే: మండలంలోని గవిగట్టు గ్రామంలో ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నిరంజన్‌రెడ్డి మంగళవారం తెలిపారు. గ్రామానికి చెందిన నక్కల నరసింహులు వర్గం, నాగేశ్ వర్గం బంధువులు. తమ ఆడపడుచు కాపురం సరిదిద్దే విషయంలో ఇరువర్గాల వారు ఘర్షణకు దిగి దాడులు చేసుకున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. నక్కల నరసింహులుపై దాడి చేసిన ముగ్గురు, నాగేశ్‌పై దాడికి పాల్పడ్డ 8 మందిపై కేసులు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

దాడి చేసిన వ్యక్తిపై కేసు

క్రైం కార్నర్

ఎమ్మిగనూరు గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని పార్లపల్లిలో నాగేశ్, మరొక వ్యక్తిపై కొడవలితో దాడి చేసిన రాజుపై కేసు నమోదు చేసినట్లు మంగళవారం గ్రామీణ ఎస్సై శ్రీనివాసులు తెలిపారు. సోమవారం దాడి చేసిన వ్యక్తి మద్యం తాగి భార్యను తిడుతూ కొట్టేందుకు వెళ్లగా అడిగినందుకు దాడి చేసినట్లు పేర్కొన్నారు.

యువకుడి అదృశ్యం

కోసిగి, న్యూస్‌టుడే: మండలంలోని చింతకుంట గ్రామానికి చెందిన కాటగేని లింగారెడ్డి మూడో కుమారుడు కాటగేని నర్సయ్య (20 అనే యువకుడు ఈ నెల 17 నుంచి అదృశ్యమైనట్లు ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. యువకుని తండ్రి మంగళవారం స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

మంత్రాలయం, న్యూస్‌టుడే: కర్ణాటక మద్యం సరఫరా చేస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు మంత్రాలయం సీఐ రామాంజులు పేర్కొన్నారు. మంగళవారం ఎస్సై విజయ్‌కుమార్, కానిస్టేబుల్ వీరేశ్, భాస్కర్‌తో కలిసి మాధవరం శివారులో అనుమానంగా తిరుగుతున్న చెట్నిహళ్లి గ్రామానికి చెందిన రాముడుని తనిఖీ చేశారు. అతని వద్ద నుంచి 15 పెట్టెల మద్యం స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

పురపాలక కార్మికులను క్రమబద్ధీకరించాలి

ఎమ్మిగనూరు గ్రామీణం, న్యూస్‌టుడే: పురపాలికలో ఏళ్ల తరబడి పని చేస్తున్న ఒప్పంద కార్మికులను క్రమబద్ధీకరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండీ అంజిబాబు డిమాండు చేశారు. మంగళవారం పట్టణంలో మున్సిపల్ కాంట్రాక్టు కార్మికుల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించి మాట్లాడారు. అనంతరం పురపాలక ఒప్పంద కార్మికుల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా కేశన్న, ప్రధాన కార్యదర్శిగా ఇస్మాయిల్, ఉపాధ్యక్షులుగా సాల్మన్, మునీంద్ర, రంగస్వామి, సహాయ కార్యదర్శులుగా నాగరాజు, తిక్కయ్య, ఖాజాతోపాటు 11 మంది సభ్యులను ఎన్నుకున్నారు.

నిధులందితేనే.. మట్టి మేలు

• రబీ ప్రారంభమైనా పూర్తికాని పరీక్షలు

రబీ సీజన్ ప్రారంభమైనా మట్టి పరీక్షలు ఒక అడుగు ముందుకు, రెండడుగులు వెనక్కి అన్న చందంగా సాగుతున్నాయి. పంటల సాగులో కీలకమైన భూసార పరీక్షలను వైకాపా పాలనలో అటకెక్కించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గతంలో సేకరించిన మట్టి నమూనాలతోపాటు ఈ ఏడాది సేకరించిన వాటి పరీక్షలకు నిధులు విడుదల చేసింది. అయితే అరకొరగా నిధులు రావడంతో మట్టి పరీక్షలు పూర్తి కాలేదు. దీంతో రబీకి ఫలితాలు అందడంపై సందిగ్ధత నెలకొంది. – న్యూస్‌టుడే, ఎమ్మిగనూరు వ్యవసాయం



పరీక్షలకు సేకరించిన మట్టి నమూనాలు



• 2023-24 సంవత్సరంలో సేకరించిన మట్టి నమూనాల పరీక్షలు పూర్తయ్యాయి. 2024-25గాను రైతు సేవా కేంద్రానికి పది నమూనాల చొప్పున సేకరించారు. వాటిలో ఎమ్మిగనూరు 966, నందవరం 730, గోనెగండ్ల 920, మంత్రాలయం 820, కోసిగి 528, కౌతాళం 736, పెద్దకడబూరు 582 మట్టి నమూనాలు పరీక్షించాల్సి ఉంది. జిల్లాలో 2023-24 సంవత్సరంలో మొత్తం 10,336 మట్టి నమూనాలు సేకరించగా వాటిన్నింటిని పరీక్షించారు. 2024-25 సంవత్సరానికిగాను 17,832 నమూనాలు సేకరించగా ఇప్పటి వరకు 5,209 పూర్తయ్యాయి. ఇప్పటికే రబీ ప్రారంభం కావడంతో పలువురు రైతులు విత్తనం వేసేందుకు సన్నద్ధమవుతున్నారు. మట్టి పరీక్షలు అసంపూర్తిగా ఉండటం, 2024-25 సంవత్సరానికిగాను బడ్జెట్ ఇంకా విడుదల కాలేదు. దీంతో మట్టి పరీక్షలు ముందుకు సాగడం లేదు.

వేధిస్తున్న సిబ్బంది కొరత

భూసార కేంద్రంలో ప్రస్తుతం ముగ్గురు ఏవోలు, ఐదుగురు ఎంపీఈవోలకుగాను ఇటీవల ఇద్దరు ఏఈవోలు ఉన్నత చదువుకు వెళ్లారు. దీంతో రెండు ఏఈవోల పోస్టులు ఖాళీ ఏర్పడ్డాయి. మట్టి పరీక్షలు పూర్తి చేసిన ఫలితాలన ఏవోలతో పాటు సిబ్బంది ఆన్‌లైన్ చేస్తున్నారు. దీంతో పనిభారం పెరిగింది. మట్టి పరీక్షలు సకాలంలో పూర్తి కావాలంటే సిబ్బందిని డిప్యూటేషన్‌పై నియమించి నిధులు విడుదల చేస్తే రబీ సీజన్‌కు ఫలితాలు అందే అవకాశముంది. లేనిచో ఈసారి కూడా రైతులకు పూర్తి స్థాయిలో ఫలితాలు అందని పరిస్థితి నెలకొంటుంది.

సకాలంలో పూర్తి చేసేందుకు కృషి

– ఎస్.మహమ్మద్ ఖాద్రీ, ఇన్‌ఛార్జి ఏడీఏ

సేకరించిన మట్టి నమూనాలను సకాలంలో పూర్తి చేసి ఫలితాలను రైతులకు అందించేందుకు కృషి చేస్తున్నాం. ప్రస్తుతం మట్టి పరీక్షలు చేస్తూ, పూర్తి చేసినవాటి ఫలితాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియ కొనసాగుతోంది.

సంక్షిప్త సమాచారం

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

ఎమ్మిగనూరు గ్రామీణం, న్యూస్‌టుడే: పంటల్లో సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు పొందవచ్చునని ఏవో ఎన్వీ మహేశ్వరరెడ్డి, ఉద్యానాధికారిణి శ్రీవాణి అన్నారు. మంగళవారం సోగనూరు, కె.తిమ్మాపురం గ్రామాల్లో పొలం పిలుస్తోంది నిర్వహించారు.

గూడూరు, న్యూస్‌టుడే: సుంకేసుల జలాశయానికి వరద నీటి ప్రవాహం తగ్గింది. మంగళవారం నాటికి 34,050 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉందని జలాశయ ఇంజినీర్ మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. 1.235 టీఎంసీల నీరు నిల్వ ఉండటంతో 8 గేట్లు ఎత్తి 33,953 క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నామన్నారు.

పెద్దకడబూరు, న్యూస్‌టుడే: వలసలు పోకుండా ఉపాధి పనులకు వెళ్లాలని పథకం సిబ్బంది మండలంలోని ముచ్చిగేరి గ్రామంలో ఇంటింటికి వెళ్లి కూలీలకు అవగాహన కల్పించారు. మంగళవారం ఏపీడీ లోకేశ్వర్ ఇంటింటికి వెళ్లి కూలీలకు అవగాహన కల్పించారు.

ఎమ్మిగనూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: పట్టణంలోని అబ్బాస్ టాకీస్ ప్రాంతంలో మంగళవారం డీఎస్పీ ఉపేంద్రబాబు ఆధ్వర్యంలో పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. నలుగురు సీఐలు, నలుగురు ఎస్సైలు, 38 మంది సిబ్బంది పట్టణంలో అనుమానాస్పద వ్యక్తుల ఇళ్లు సోదాలు చేశారు.


వరద ప్రవాహాన్ని పరిశీలిస్తున్న అధికారులు

నిరంతరం అప్రమత్తత అవసరం

కర్నూలు జలమండలి, న్యూస్‌టుడే: తుంగభద్ర నదిలో వరదనీటి ప్రవాహం ఉద్ధృతంగా ఉన్న నేపథ్యంలో నిరంతరం అప్రమత్తంగా ఉండాలని జలవనరుల శాఖ కర్నూలు ఎస్‌ఈ బి.బాలచంద్రారెడ్డి ఆదేశించారు. ఆయన మంగళవారం జిల్లాలోని పలు ప్రాజెక్టులను పరిశీలించారు. తుంగభద్ర డ్యాంకు వరద నీరు పెరగడంతో జాగ్రత్తగా ఉండాలని సిబ్బందికి సూచించారు. ఎక్కడా ఎలాంటి పొరబాట్లు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పలు అంశాలను ఆర్డీఎస్ ఈఈ భాస్కర్‌రెడ్డి, డీఈఈ విజయకుమార్ వివరించారు.

కర్నూలు

• కర్నూలు • పాణ్యం

వసతిగృహాల తనిఖీ

కర్నూలు న్యాయవిభాగం, న్యూస్‌టుడే : జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకటశేషాద్రి, జిల్లా బీసీ సంక్షేమ సాధికారత అధికారిణి వెంకటలక్ష్మమ్మ మంగళవారం కర్నూలు బి.క్యాంపులోని ప్రభుత్వ బాలికల వసతిగృహాలను తనిఖీ చేశారు. భోజనం ఇతర సౌకర్యాలు పరిశీలించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
కర్నూలు : 80085 52632
కర్నూలు గ్రామీణం : 85010 05408
ఓర్వకల్లు : 63004 66875

కర్నూలు నగరపాలకసంస్థ : **సమస్య:** బీక్యాంపు, అరోరానగర్ కాలనీల్లో కాలువలు శుభ్రం చేయాలి. వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. **– మురళీ**

సమస్య : చెన్నమ్మ కూడలిలో రహదారులపై పశువులు సంచరిస్తున్నాయి. రాకపోకలు సాగే క్రమంలో ఇబ్బందులు పడుతున్నాం. **– ఉత్తేజ్**

సమాధానం: సమస్యలు పరిశీలించి పరిష్కరిస్తాం. – నగరపాలక సంస్థ అధికారులు

టైలరింగ్‌లో ఉచిత శిక్షణ

కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే: కెనరా బ్యాంకు స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో ఉమ్మడి కర్నూలు జిల్లాలోని గ్రామీణ ప్రాంతానికి చెందిన నిరుద్యోగ మహిళలకు ‘టైలరింగ్’లో నవంబరు 2 నుంచి ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ డైరెక్టర్ కె.పుష్పక్ ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ కాలంలో ఉచిత భోజనం, వసతి ఉంటుందన్నారు. వివరాలకు కల్లూరు తహసీల్దారు కార్యాలయ సమీపంలోని సంస్థ కార్యాలయంలోగానీ.. 90007 10508 నంబరును సంప్రదించాలని కోరారు.

పరిశ్రమలతో యువతకు ఉపాధి

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : డ్రోన్ పరిశ్రమ ఏర్పాటు కోసం ఓర్వకల్లులో 300 ఎకరాలు కేటాయిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెప్పారని తెదేపా రాష్ట్ర కార్యదర్శి నంద్యాల నాగేంద్ర మంగళవారం అన్నారు. ఓర్వకల్లులో పరిశ్రమలు వస్తే స్థానికంగా ఉద్యోగావకాశాలు పెద్దఎత్తున లభిస్తాయని చెప్పారు.

బదిలీ చేసి న్యాయం చేయండి

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : తనను కర్నూలు జిల్లాకు బదిలీ చేయాలని నంద్యాల జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వ్ విభాగానికి చెందిన ఓ కానిస్టేబుల్ డీజీపీకి లేఖ రాశారు. తన సొంత జిల్లా కర్నూలు అయినప్పటికీ అన్యాయంగా నంద్యాల జిల్లాకు పంపారన్నారు. తన సమస్యను పరిష్కరించాలని కోరారు.

నిరభ్యంతరానికి నిరీక్షణ

• ఎన్‌వోసీ ఇవ్వని అగ్నిమాపక శాఖ

• బాణసంచా దుకాణాల అనుమతులకు ఎదురుచూపు



దీపావళి సమీపిస్తోంది. పండగను ఘనంగా జరుపుకొనేందుకు జనం సిద్ధమవుతున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా బాణసంచా అమ్మకాలకు సంబంధించి ఇప్పటి వరకు అనుమతులు రాలేదు. పండగకు మరో వారం రోజులే గడువు ఉంది. ఈ నేపథ్యంలో బాణసంచా విక్రయించేందుకు ఆర్డీవో జారీ చేసే తాత్కాలిక అనుమతుల కోసం వ్యాపారులు ఎదురు చూస్తున్నారు. పోలీసు శాఖ, విపత్తు స్పందన అగ్నిమాపక శాఖ, స్థానిక సంస్థల నుంచి నిరభ్యంతర పత్రాలు పొందిన తర్వాత ఆర్డీవో కార్యాలయానికి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది. అనంతరం 15 రోజుల కాలపరిమితితో ఆర్డీవో తాత్కాలిక అనుమతులు జారీ చేస్తారు.

– న్యూస్‌టుడే, కర్నూలు నేరవిభాగం

ఈసారి 100 మందికే..?

విపత్తు స్పందన అగ్నిమాపక శాఖ నుంచి ఒకటి రెండు రోజుల్లో ఎన్‌వోసీ జారీ చేసే అవకాశముందని సమాచారం. ఈసారి సైతం నగరంలోని ఎస్టీబీసీ కళాశాల మైదానంలో దుకాణాలు ఏర్పాటు చేయనున్నారని, 100 మందికి మాత్రమే అనుమతుల జారీ చేసే అవకాశమున్నట్లు తెలుస్తోంది. ఎక్కువ అనుమతులు ఇస్తే నష్టం రావడంతోపాటు మైదానంలో ఏర్పాట్లకు సమస్యలు ఎదురవుతాయని.. రద్దీ సమస్య ఉంటుందని పలువురు పేర్కొంటున్నారు.

ఇతర శాఖలు ఇచ్చినా..

బాణసంచా అమ్మకాలకు సంబంధించి పలువురు వ్యాపారులు విపత్తు స్పందన అగ్నిమాపక శాఖ మినహా ఇతర శాఖల నుంచి ఎన్‌వోసీలు పొందారు. విపత్తు స్పందన అగ్నిమాపక శాఖ ఉన్నతాధికారుల నుంచి ఎలాంటి ఆదేశాలు రాకపోవడంతో ఆ శాఖ జిల్లా అధికారులు ఎన్‌వోసీలు జారీ చేయడం లేదు. తమ శాఖ రాష్ట్ర ఉన్నతాధికారి నుంచి అనుమతి వస్తే తప్ప నిరభ్యంతర పత్రాలు జారీ చేయలేమని స్టేషన్ అధికారులు స్పష్టం చేస్తున్నారు. అగ్నిమాపకశాఖ నుంచి ఎన్‌వోసీ వస్తే తప్ప ఆర్డీవో తాత్కాలిక అనుమతి ఇవ్వరు. ఈ నేపథ్యంలో వ్యాపారులు అగ్నిమాపకశాఖ కార్యాలయాలు, స్టేషన్ల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

తెరపైకి కొత్త సంఘం

కర్నూలులో బాణసంచా వ్యాపారులకు సంబంధించి ఈ దీపావళికి కొత్త సంఘం ఏర్పాటుకానుంది. గతంలో వైకాపా నాయకుల అనుచరులు సంఘాలు ఏర్పాటు చేశారు. పలువురికి డబ్బులు ఇవ్వాలంటూ ఒక్కో వ్యాపారి నుంచి భారీగా నగదు వసూలు చేశారు. గతంలో ఒక్కో వ్యాపారి నుంచి రూ.28 వేలు వసూలు చేయగా 2023 సంవత్సరంలో ఏకంగా రూ.34 వేలు వసూలు చేయడం గమనార్హం. గతంలో వైకాపా ప్రభుత్వం అధికారంలో ఉండటంతో వ్యాపారులు ప్రశ్నించే ధైర్యం చేయలేక అడిగినంత ఇచ్చేశారు. ప్రస్తుతం మంత్రికి అనుచరుడిగా చెప్పుకొంటున్న ఓ యువకుడు కొత్త సంఘం ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తున్నాడు.

నూతన కౌలుదారు చట్టంతో న్యాయం

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: కౌలుదారులను అన్నివిధాలా ఆదుకునేలా నూతన కౌలుదారు చట్టాన్ని ప్రభుత్వం రూపొందిస్తోందని పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అన్నారు. ఉమ్మడి కర్నూలు, అనంతపురం జిల్లాలకు సంబంధించి కర్నూలు నగరంలోని ఉద్యాన భవన్‌లో మంగళవారం ప్రాంతీయ సదస్సు నిర్వహించారు. జేసీ డా.బి.నవ్య మాట్లాడుతూ భూ యజమానులకు ఎలాంటి నష్టం జరగకుండా కౌలుదారులకు మేలు జరిగేలా కౌలుదారుల చట్టం-2024ను రూపొందిస్తున్నట్లు పేర్కొన్నారు. దీనికి సంబంధించి సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు. సీసీఆర్‌సీ కార్డులు పొందిన కౌలుదారులకు ఆ భూమిలో పండించిన పంటపై హక్కు మాత్రమే లభిస్తుందని.. భూమిపై ఎలాంటి హక్కులు ఉండవన్నారు. కర్నూలు, నంద్యాల, అనంతపురం జిల్లాల వ్యవసాయాధికారులు పీఎల్ వరలక్ష్మి, మురళీకృష్ణ, ఉమామహేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జేసీ డా.బి.నవ్య

మహిళలను వేధిస్తే చర్యలు

కర్నూలు విద్య, న్యూస్‌టుడే: విధి నిర్వహణలో ఉన్న మహిళలపై వేధింపులకు పాల్పడితే చర్యలు తప్పవని జేసీ నవ్య అన్నారు. ఐసీడీఎస్ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకటశేషాద్రి మాట్లాడుతూ వేధింపులకు గురైతే సమస్యను దాచిపెట్టకుండా నిర్భయంగా ఫిర్యాదు చేస్తే నిందితులపై చట్టపరమైన చర్యలు ఉంటాయన్నారు. ప్రతి కార్యాలయంలో ఇంటర్నల్ కంప్లయింట్ కమిటీ ఏర్పాటు చేసుకోవాలన్నారు. గోడ పత్రాలు ఆవిష్కరించారు. ఐసీడీఎస్ పీడీ వెంకటలక్ష్మమ్మ, లైంగిక వేధింపుల నిరోధక కమిటీ ఛైర్‌పర్సన్ డాక్టర్ మాధవి శ్యామల, న్యాయవాది నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు రుణాలివ్వాలని ఆందోళన

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే: బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ కార్పొరేషన్ల ద్వారా చేతివృత్తిదారులకు రుణాలివ్వాలని ఆ సమాఖ్య జిల్లా కార్యదర్శి కారన్న, మాధవస్వామి డిమాండ్ చేశారు. నగరంలోని సంక్షేమ భవన్ వద్ద ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా చేశారు. వారు మాట్లాడుతూ రాష్ట్ర జనాభాలో సుమారు 30 శాతం మంది వృత్తి నైపుణ్యం కలిగిన చేతివృత్తిదారులున్నారని చెప్పారు. రాష్ట్ర బడ్జెట్‌లో 25 శాతం నిధులు కేటాయించి ఉప ప్రణాళిక ద్వారా నిధులు ఖర్చు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు బాబయ్య, బీసన్న, రామాంజనేయులు, సురేంద్రయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతోనే గుర్తింపు సాధ్యం

కర్నూలు క్రీడలు (బి.క్యాంపు), న్యూస్‌టుడే: క్రీడలతోనే గుర్తింపు వస్తుందని న్యాయవాది శ్రీధర్‌రెడ్డి, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి గిడ్డయ్య అన్నారు. నగరంలోని డీఎస్‌ఏ స్టేడియంలో అండర్-14, 17 బాలబాలికల ఖోఖో, సైక్లింగ్, ఉషూ తదితర వాటిల్లో ఎంపిక పోటీలను మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ సహాయ కార్యదర్శి కె.పరమేష్, డి.శంకరరావు, వ్యాయామ ఉపాధ్యాయులు రాజశేఖర్, జయగణపతి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.


సైక్లింగ్ పోటీలకు సిద్ధమైన విద్యార్థులు

పంట సాగులో విత్తనశుద్ధి తప్పనిసరి

ఓర్వకల్లు న్యూస్‌టుడే: పంట సాగులో రైతులు విత్తనశుద్ధిని తప్పనిసరిగా పాటించి అధిక దిగుబడులు సాధించాలని ఏవో సుధాకర్ అన్నారు. మండలంలోని ఎన్.కొంతలపాడు, తిప్పాయిపల్లె, సోమయాజులపల్లె తదితర గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని మొక్కజొన్న పంటను పరిశీలించి పంట కోత ప్రయోగం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఈవో భాస్కర్, సుశాంతి, నగేష్ తదితరులు పాల్గొన్నారు.


పంటకోత ప్రయోగాన్ని పరిశీలిస్తున్న ఏవో సుధాకర్

పోటీలతో సృజనకు పదును


వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు


బహుమతులు అందజేస్తున్న ఆదిత్య విద్యానిలయం అధినేత వాసుదేవయ్య

పోటీ పరీక్షలతో విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీయొచ్చని ఆదిత్య విద్యానిలయం అధినేత వాసుదేవయ్య అన్నారు. కల్లూరులోని పాఠశాలలో ‘ఈనాడు’ ఆధ్వర్యంలో మంగళవారం ప్రతిభా పాటవ పోటీలు జరిగాయి. కె.శ్యాలిని (పదో తరగతి) ప్రథమ, ఎస్.వైష్ణవి (తొమ్మిదో తరగతి) ద్వితీయ, జి.బిందు మాధవి (పదో తరగతి) తృతీయ స్థానాల్లో నిలిచారు. వారికి ఆయనతోపాటు పాఠశాల సమన్వయకర్త అఫీఫ, ఉపాధ్యాయురాలు పుణ్యవతి, ఫౌజియాబేగం, సునీతాకుమారి బహుమతులు అందజేశారు. – న్యూస్‌టుడే, కల్లూరు గ్రామీణ

ప్రతిభకు గుర్తింపు


భాష్యం పాఠశాలలో వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు


బహుమతులు అందుకున్న విద్యార్థినులు

ప్రతిభా పాటవ పోటీలు విద్యార్థుల్లోని సృజనకు పదును పెడతాయని కర్నూలు ఎన్‌ఆర్‌పేట భాష్యం పాఠశాల ప్రిన్సిపల్ బి.శ్రావణ్‌కుమార్ అన్నారు. ‘ఇంటర్నెట్ వినియోగంతో లాభనష్టాలు-విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం’ అంశంపై ‘ఈనాడు’ ఆధ్వర్యంలో మంగళవారం ఎన్‌ఆర్‌పేటలోని పాఠశాలలో వ్యాసరచన పోటీలు జరిగాయి. ప్రథమ, ద్వితీయ బహుమతులను పదో తరగతి విద్యార్థినులు అయేషా ఫాతిమా, పి.శ్రీప్రియ, తృతీయ బహుమతిని బి.శ్రుతి (తొమ్మిదో తరగతి) గెలుచుకున్నారు. వారికి ఆయనతోపాటు హెచ్‌వోడీ ఎస్.సురేష్‌బాబు, ఉపాధ్యాయుడు రాజశేఖర్, ఇన్‌ఛార్జి తిమోతిపాల్ బహుమతులు అందజేశారు. – న్యూస్‌టుడే, కల్లూరు గ్రామీణ

సంక్షిప్త సమాచారం

కర్నూలు నగరపాలకసంస్థ, న్యూస్‌టుడే: నగరంలోని పలు సచివాలయాల్లో ప్రారంభమైన ఆధార్ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని నగరపాలకసంస్థ కమిషనర్ రవీంద్రబాబు ఒక ప్రకటనలో తెలిపారు. 25వ తేదీ వరకు శిబిరాలు ఉంటాయని చెప్పారు.

కర్నూలు నగరపాలకసంస్థ, న్యూస్‌టుడే: ఎస్బీఐ కాలనీలోని నగరపాలక నూతన కౌన్సిల్ హాలులో ఈనెల 25న నగరపాలక పాలకవర్గ సమావేశం నిర్వహిస్తున్నట్లు నగర పాలక కమిషనర్ రవీంద్రబాబు ఒక ప్రకటనలో తెలిపారు.

కర్నూలు నగరపాలకసంస్థ, న్యూస్‌టుడే: అమీర్‌హైదర్‌ఖాన్ నగర్‌లో సీసీ రోడ్లు నిర్మించాలని సీపీఎం నాయకులు కోరారు. వారు మంగళవారం కమిషనర్ రవీంద్రబాబును కలిసి విన్నవించారు. రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే: శరీన్‌నగర్ ప్రాంతంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కార్యకర్తలు నిరంతరం కృషి చేయాలని సీపీఎం నాయకులు కోరారు. కల్లూరులోని సూర్యనారాయణ భవన్‌లో మంగళవారం సమావేశం నిర్వహించారు. నాయకులు సీహెచ్ సాయిబాబా, సుధాకరప్ప, ఏసు, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే: కల్లూరు పట్టణ పరిధి 27వ వార్డు శ్రీరామ కాలనీలో రహదారుల పనులు పూర్తి చేయాలని సీపీఎం నేత సీహెచ్ సాయిబాబా డిమాండ్ చేశారు. వారు మంగళవారం కాలనీలో పర్యటించారు.

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి సంబంధించి ఎస్సీ, ఎస్టీ వర్గీకరణను అమలు చేయాలని జైభీమ్ ఎమ్మార్పీఎస్ ఏపీ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు జానయ్య మాదిగ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవి మాదిగ డిమాండ్ చేశారు. వారు మంగళవారం మాట్లాడారు.

వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే : భారీ వర్షాల కారణంగా కర్నూలు 19వ వార్డులో రహదారులు దెబ్బతిని ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని సీపీఐ నగర కార్యదర్శి రామకృష్ణారెడ్డి, సహాయ కార్యదర్శి చంద్రశేఖర్, కుమార్ అన్నారు. వారు మంగళవారం వార్డులో పర్యటించారు. తక్షణమే అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే : గొర్రెలు, మేకల పెంపకందారుల సహకార ఎన్నికల్లో ఏకగ్రీవంగా జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన కురువ శ్రీనివాసులు, రాముడు, వెంకటేశ్వర్లుకు రజక వృత్తిదారుల సంఘం నేత గురుశేఖర్ ఒక ప్రకటనలో అభినందనలు తెలిపారు.

ఏడు మండలాల్లో తేలికపాటి వర్షం

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: జిల్లాలో ఏడు మండలాల్లో సోమవారం నుంచి మంగళవారం ఉదయం వరకు తేలికపాటి వర్షం కురిసింది. గూడూరు, కర్నూలు అర్బన్‌లో 7.4 మి.మీ. కురిసింది. కల్లూరు 5.4, కౌతాళం 4.0, కర్నూలు రూరల్ 2.4, ఎమ్మిగనూరులో 2.2 మి.మీ. నమోదైంది. జిల్లా సగటున 1.1 మి.మీ.గా ఉంది. ఈనెల సాధారణ వర్షపాతం 110.2 మి.మీ. కాగా ఇప్పటి వరకు 81.8 మి.మీ. కురిసింది.

చర్యలు తీసుకోవాలని వినతి

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : ఉద్యోగాల పేరుతో నిరుద్యోగులను మోసగిస్తున్న విబిలీవర్స్ సంస్థ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, నగర అధ్యక్షుడు బాబయ్య తదితరులు కోరారు. వారు మంగళవారం కర్నూలు డీఎస్పీ బాబూప్రసాద్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. కర్ణాటకకు చెందిన భీమరాజ్, సురేష్, మెగారెడ్డిలు స్థానిక కృష్ణానగర్‌లో అద్దె భవనంలో సంస్థను ఏర్పాటు చేశారన్నారు. నిరుద్యోగులకు మాయమాటలు చెప్పి డబ్బులు వసూలు చేశారని చెప్పారు. పూర్తిస్థాయిలో విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలని కోరారు.

గొర్రెలు, మేకల పెంపకందారుల అభివృద్ధికి కృషి

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: గొర్రెలు, మేకల పెంపకందారుల అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామని గొర్రెలు, మేకల పెంపకందారుల సహకార సంఘం ఉమ్మడి కర్నూలు జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు అన్నారు. ఆ సంఘం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమం మంగళవారం నగరంలోని బహూళార్థ పశువైద్యశాల ఆవరణలోని ఏపీ సాంద్ర గొర్రెల విభాగం కార్యాలయంలో జరిగింది. అధ్యక్షుడిగా సల్కాపురం శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడిగా బండి ఆత్మకూరుకు చెందిన బాలగురప్ప యాదవ్, డైరెక్టర్లు ప్రమాణ స్వీకారం చేశారు. కర్నూలు పార్లమెంట్ నియోజకవర్గ తెదేపా అధ్యక్షుడు పాలకుర్తి తిక్కారెడ్డి, కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, పత్తికొండ, కోడుమూరు ఎమ్మెల్యేలు కేఈ శ్యాంబాబు, బొగ్గుల దస్తగిరి, గొర్రెలు, మేకల పెంపకందారుల సమాఖ్య మాజీ అధ్యక్షుడు వై.నాగేశ్వరరావు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.


అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేస్తున్న శ్రీనివాసులు, పక్కన ఎంపీ నాగరాజు, ఎమ్మెల్యే దస్తగిరి, తిక్కారెడ్డి తదితరులు

జలం.. హాలాహలం

కర్నూలు ఉస్మానియా కళాశాల సమీపంలోని కుమ్మరి వీధిలో పైపులైన్లు కాలువల్లో ఉన్నాయి. ఫలితంగా తాగునీరు కలుషితమవుతోంది. ఏళ్ల తరబడి ఇలానే ఉన్నా అధికారులు దృష్టి సారించడం లేదని కాలనీవాసులు పేర్కొంటున్నారు. నీరు సైతం దుర్వాసన వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. – న్యూస్‌టుడే, కర్నూలు బీక్యాంపు



బురద మార్గం.. తప్పదు ప్రమాదం



కర్నూలులోని సిల్వర్‌జూబ్లీ కళాశాల నుంచి ఏపీఈఆర్‌సీ భవనం మీదుగా దిన్నెదేవరపాడుకు వెళ్లే ప్రధాన రహదారి వెంబడి అడుగడుగునా గుంతలు ఏర్పడ్డాయి. ఈ మార్గంలో ప్రతిరోజూ జనం వాహనాల్లో రాకపోకలు సాగిస్తుంటారు. గుంతల నేపథ్యంలో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. దీనికితోడు వీధి దీపాలు లేకపోవడంతో సమస్యలు ఎదురవుతున్నాయి. అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాల్సి ఉంది. – న్యూస్‌టుడే, వెంకటరమణ కాలనీ

సైబర్ నేరంపై కేసు నమోదు

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : కర్నూలు రామలింగేశ్వర్‌నగర్‌కు చెందిన రవికుమార్ సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయారు. సామాజిక మాధ్యమాల్లో పరిచయమైన మోసగాడు పార్ట్‌టైం ఉద్యోగం ఆశ చూపి టాస్కుల పేరుతో నమ్మించాడు. వెబ్‌సైట్ ద్వారా చాటింగ్ చేయించి నమ్మకం పెంచాడు. చివరికి ఇతని నుంచి రూ.17.13 లక్షలు తీసుకుని మోసగించాడు. బాధితుడు కర్నూలు నాలుగో పట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్తు శాఖ ఉద్యోగిపై దాడి

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : విద్యుత్తు శాఖలో అసిస్టెంట్ లైన్‌మెన్‌గా పనిచేసే అబ్దుల్‌సలాంపై మంగళవారం దాడి జరిగింది. కరెంటు బిల్లులు చెల్లించకపోవటంతో శ్రీరామ్‌నగర్‌లోని రెండు ఇళ్లకు సరఫరా ఆపేశారు. హరి, గౌతమ్, అఖిల్ అనేవారు కరెంటు బిల్లులు చెల్లిస్తామని, కనెక్షన్ తొలగించొద్దని కోరారు. బిల్లులు చెల్లించి రశీదును తమ అధికారులకు చూపితే మళ్లీ కనెక్షన్ ఇస్తామని అబ్దుల్‌సలాం చెప్పారు. దీంతో వారు గొడవ పెట్టుకొని అబ్దుల్‌సలాంపై కర్రలతో దాడి చేశారు. బాధితుడు మూడో పట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

అక్రమ మద్యం కేసులో అరెస్టు

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : మద్య నిషేధ, ఆబ్కారీ శాఖ కర్నూలు స్టేషన్ సీఐ చంద్రహాస్, ఎస్సై రెహానా తమ సిబ్బందితో కలిసి మంగళవారం వేర్వేరు చోట్ల దాడులు నిర్వహించారు. పసుపల వద్ద మాణిక్యమ్మను అరెస్టు చేసి 10 లీటర్ల నాటు సారా, బి.తాండ్రపాడుకు చెందిన తెలుగులక్ష్మిని అరెస్టు చేసి 75 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. కర్నూలు స్టేషన్‌లో వీరిపై కేసులు నమోదు చేశారు.

క్రైం కార్నర్

15 వాహనాల సీజ్

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : శరీన్‌నగర్‌లో మంగళవారం పోలీసులు నాకాబందీ నిర్వహించారు. కర్నూలు డీఎస్పీ బాబూప్రసాద్, ఆరుగురు సీఐలు, ఎస్సైలు, 60 మంది పోలీసులు కలిసి తెల్లవారుజామున కాలనీని చుట్టుముట్టి పాత అనుమానితుల ఇళ్లను తనిఖీ చేశారు. సరైన పత్రాలు లేని 15 బైకులను సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. ఏడుగురు రౌడీ షీటర్లకు మంత్రణం చేశారు.


మంత్రణం చేస్తున్న డీఎస్పీ బాబూప్రసాద్

గని గుంతలు.. కానరాని వసతులు

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : కల్లూరు అర్బన్ పరిధిలోని పలు కాలనీల్లో కనీస వసతులు కరవయ్యాయి. ఫలితంగా జనం నరక యాతన పడుతున్నారు. చింతలముని నగర్‌లోని గని గుంతల కాలనీలో సుమారు 300 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. జనం ఏళ్ల తరబడి నివసిస్తున్నారు. చినుకు పడితే చాలు.. కాలనీలోకి వర్షం నీరు పెద్దఎత్తున చేరుతోంది. దీనికితోడు మురుగు నీరు బయటకు వెళ్లే మార్గం లేకపోవడంతో దోమలు వృద్ధి చెంది వ్యాధులు ప్రబలుతున్నాయి. దోమల స్వైర విహారంతో కంటి మీద కునుకే కరవవుతోంది.

☛ వందల కుటుంబాలకు నరకయాతన


గని గుంతల కాలనీలో రహదారిపై నిలిచిన మురుగునీరు

జనరేటర్లతో నీటిని తోడేస్తూ..

గత కొన్ని రోజులుగా కురిసిన వర్షాలకు ఇళ్ల మధ్యలో పెద్దఎత్తున నీరు నిలిచిపోయింది. మురుగునీరు సైతం కలవడంతో భరింపరాని దుర్గంధంతో అల్లాడిపోయారు. చివరికి కొందరు కాలనీవాసులు జనరేటర్లు ఏర్పాటుచేసుకుని నీటిని బయటకు తోడుకోవాల్సి వచ్చింది. దీనికిగాను సుమారు రూ.30 వేల వరకు ఖర్చు చేశారు. తాము కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని.. నిత్యం ఇబ్బందులు పడుతున్నా అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదని స్థానికులు పేర్కొంటున్నారు. గతంలో కొందరు తక్కువ ధరకు ఇళ్ల స్థలాలు అమ్ముతుండగా కొనుగోలు చేసి గృహాలు నిర్మించుకున్నామని.. ప్రస్తుతం ఏడాది పొడవునా నరకయాతన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

☛ చింతల మునినగర్, భగవాన్ నగర్ తదితర ప్రాంతాల మీదుగా మురుగు నీరు వచ్చి చేరుతోంది. ఈ నేపథ్యంలో కాలనీలో అవసరమైన సదుపాయాలు కల్పించాలని, సీసీ రహదారులు, కాలువలు నిర్మించాలని స్థానికులు విన్నవించారు.

ఎవరూ పట్టించుకోవడం లేదు

– సలీమా, కాలనీవాసి



కాలనీలో వసతులు కల్పించాలని గత వైకాపా ప్రభుత్వ హయాంలో పలుమార్లు అధికారులు, నాయకులకు విన్నవించాం. చేస్తాం.. చూస్తాం.. అంటూ కాలయాపన చేశారు.. ఐదేళ్లలో ఒక్కరోజైనా మా కాలనీకి వచ్చి సమస్యల గురించి తెలుసుకున్న పాపాన పోలేదు. పన్నులు మాత్రం బలవంతంగా వసూలు చేస్తున్నారు. సదుపాయాలు కల్పించడంలో నిర్లక్ష్యం చేస్తున్నారు.

కాలువలు, రోడ్లు నిర్మించాలి

– మద్దమ్మ



ఇతర ప్రాంతాల నుంచి మురుగు నీరు కాలనీలోకి రాకుండా తగిన చర్యలు చేపట్టాలి. కాలువలు నిర్మించి మురుగు నీరు చేరకుండా చూడాలి. కాలనీలో నెలకొన్న సమస్యలపై నగరపాలక సంస్థ అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోలేదు. ఫలితంగా వందలాది కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయి. కనీస వసతులు కల్పిస్తే మా సమస్యలు తీరుతాయి.

బాధ్యతల స్వీకరణ

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: కర్నూలు జిల్లా సర్వే ఏడీ కార్యాలయ సూపరింటెండెంట్‌గా వి.జ్యోతి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. చిత్తూరు జిల్లా సూపరింటెండెంట్‌గా పనిచేస్తూ కర్నూలు జిల్లాకు బదిలీపై వచ్చారు. ప్రస్తుతం పనిచేస్తున్న అబ్దుల్ కలాంను చిత్తూరు జిల్లాకు బదిలీ చేశారు.

అంతర్జాలంలో జాబితా

కర్నూలు వైద్యాలయం, న్యూస్‌టుడే : ఏఎన్ఎం గ్రేడ్-3 పదోన్నతులకు సంబంధించి ఉమ్మడి జిల్లాలో పలువురు అభ్యర్థుల ర్యాంకుల విషయంలో తలెత్తిన సందేహాల నివృత్తికిగాను ఏఎన్ఎం రివైజ్డ్ ప్రొవిజనల్ జాబితాను ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ భాస్కర్ మంగళవారం తెలిపారు. ప్రభుత్వం నుంచి అందిన అర్హుల మొదటి, రెండు, మూడో జాబితాను వెబ్‌సైట్‌లో ఉంచినట్లు పేర్కొన్నారు.